

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 01-06-2026 | సంపుటి - 28 | సంచిక -06 | రూ : 4 | పేజీలు: 8


## 'సర్'పై.. అప్రమత్తంగా ఉండండి

- పార్టీ శ్రేణులకు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే సూచన



హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. ఇతర రాష్ట్రాల్లో సర్ పేరుతో భాజపా ఏకపక్షంగా వ్యవహరించిందని, తెలంగాణలో అలాంటిది జరగకుండా కాంగ్రెస్ శ్రేణులన్నీ పోరాడాలని ఆయన చెప్పినట్లు సమాచారం. కర్ణాటకలోని కలబురిగి వెళుతూ విమానం మారడానికి శనివారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన ఆయన నోవాటెల్ హోటల్‌లో బస చేశారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం ఆయనతో అల్పాహార విందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా జాతీయ, రాష్ట్ర రాజకీయాలపై కొద్దిసేపు చర్చించారు. ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం వివరాలు, పార్టీ కార్యక్రమాలను ఖర్గేకి మహేశ్‌కుమార్‌గౌడ్ వివరించారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్‌లో నాగార్జునకొండ వద్ద ఉన్న బుద్ధుడి మ్యూజియంను సందర్శించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఖర్గేను ఆహ్వానించినట్లు సమాచారం. ఆదివారం పౌర్ణమి సందర్భంగా అక్కడికి వస్తే బావుంటుందని సీఎం కోరినట్లు తెలుస్తోంది. కానీ ముందుగా నిర్ణయించిన కార్యక్రమాల వల్ల ప్రస్తుతం తాను రాలేనని, త్వరలో తరువాయి 2లో



## ఆర్సీబీకి ఐపీఎల్-2026 టైటిల్

# ఫైనల్లో గుజరాత్ పై ఘనవిజయం!

- ఐపీఎల్ 2026 ఫైనల్‌లో గుజరాత్‌పై 5 వికెట్ల తేడాతో ఆర్సీబీ విజయం
- రెండోసారి ఐపీఎల్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
- అజేయ అర్ధశతకంతో (75*) జట్టును గెలిపించిన విరాట్ కోహ్లీ
- తొలుత గుజరాత్‌ను 155 పరుగులకే కట్టడి చేసిన ఆర్సీబీ బౌలర్లు
- సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించి ఆర్సీబీకి ఘనమైన విజయాన్ని అందించిన కోహ్లీ

2లో

అమెరికా డ్రోన్‌పై ఇరాన్ దాడి

## యుద్ధ వాతావరణం

- అమెరికా ఎంక్యూ1 డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటన
- తమ జలాల్లోకి శత్రుత్వ కార్యకలాపాల కోసం రావడంతోనే కూల్చామని వెల్లడి
- గతవారం కూడా ఒక అమెరికన్ డ్రోన్‌ను కూల్చివేశామన్న ఇరాన్
- ఇరాన్‌పై ఆత్మరక్షణ దాడులు చేశామని అమెరికా ప్రకటన

2లో





బద్రీనాథ్ యాత్ర 2లో

## ట్రాఫిక్ కష్టాల్లో భక్తులు

- జోషీమఠ్ వద్ద 30 కిలోమీటర్ల మేర స్తంభించిన వాహనాలు
- తిండి, నీరు లేక గంటల తరబడి యాత్రికుల అవస్థలు
- ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు రంగంలోకి దిగిన అధికారులు
- వన్‌వే విధానం ద్వారా వాహనాలను పంపిస్తున్న పోలీసులు

మరోసారి పెరిగిన

## కమర్షియల్ సిలిండర్ ధరలు




- నంద్యాలలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం
- ఇది వైసీపీ నేతల కుట్ర అని లోకేష్ ఫైర్
- జగన్ తన 'గొడ్డలి పార్టీ' కార్యకర్తలతో అశాంతి సృష్టిస్తున్నారని విమర్శలు
- జగన్ కుట్ర రాజకీయాలు మానడం లేదని ఆగ్రహం


హైదరాబాద్ : దేశంలో కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరలు మరోసారి పెరిగాయి. 19 కిలోల సిలిండర్‌పై చమురు మార్కెటింగ్ కంపెనీలు తాజా పెంపు ప్రకటించడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపారాలపై అదనపు భారం పడనుంది. అయితే గృహ వినియోగానికి ఉపయోగించే 14.2 కిలోల సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ఢిల్లీలో రూ.42 పెరుగుదలతో తరువాయి 2లో

సూపర్ స్టార్ సేవలు చిరస్మరణీయం..

## కృష్ణకు సీఎం చంద్రబాబు ఘన నివాళి

- సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా నివాళులర్పించిన సీఎం చంద్రబాబు
- తెలుగు సినిమాకు కృష్ణ సేవలు మరువలేనివని కొనియాడిన సీఎం
- నూతన సాంకేతికతను పరిశ్రమకు పరిచయం చేశారని ప్రశంస






2లో

## ఇరాన్‌తో డీల్‌పై ట్రంప్ వెనకడుగు..

చర్చలంటూనే దాడి హెచ్చరికలు

2లో



# ఆర్సీబీకి ఐపీఎల్-2026 టైటిల్.. ఫైనల్లో గుజరాత్ పై ఘనవిజయం!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) నిలిచింది. నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, వరుసగా రెండోసారి ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (75 నాటౌట్; 42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు) అద్భుతమైన అర్ధశతకంతో జట్టును ముందుండి నడిపించి విజయతీరాలకు చేర్చాడు. 156 పరుగుల లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి అదిరిపోయే ఆరంభం లభించింది. ఓపెనర్లు విరాట్ కోహ్లీ, వెంకటేశ్ అయ్యర్ గుజరాత్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ముఖ్యంగా కోహ్లీ, తన మణికట్టు మాయాజాలంతో అద్భుతమైన ఫ్లిక్స్, పుల్ షాట్లతో కగిసో రబాడ, మహ్మద్ సిరాజ్ బౌలింగ్‌ను చీల్చి చెండాడాడు. మరోవైపు, కుడి మోకాలి నొప్పితో బాధపడుతున్నప్పటికీ వెంకటేశ్ అయ్యర్ (16 బంతుల్లో 32) దూకుడుగా ఆడాడు. ఈ జోడీ కేవలం 21 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఐపీఎల్ ఫైనల్స్‌లో సరికొత్త రికార్డు సృష్టించింది. అయితే, వెంకటేశ్ అయ్యర్, దేవదత్ పడిక్కల్ స్వల్ప వ్యవధిలో ఔటవడంతో ఆర్సీబీ కాస్త నెమ్మదించింది. రజత్ పాటిదార్ (14) కొన్ని చక్కటి షాట్లు ఆడినప్పటికీ, రషీద్ ఖాన్ ఒకే ఓవర్లో పటీదార్‌ను, కృనాల్ పాండ్యా (0)ను ఔట్ చేసి మ్యాచ్‌లో ఉత్కంఠ పెంచాడు. ఈ దశలో కండరాల నొప్పితో ఇబ్బంది పడుతున్నప్పటికీ కోహ్లీ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. కేవలం 25 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకుని జట్టుపై ఒత్తిడిని తగ్గించాడు. టిమ్ డేవిడ్ (11) కూడా త్వరగానే ఔటయినా, కోహ్లీ తన క్లాస్ ఆటతీరుతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. 63 పరుగుల వద్ద శుభ్‌మన్ గిల్ పట్టిన డైవింగ్ క్యాచ్‌ను రీప్లేలలో బంతి నేలను తాకినట్లు తేలడంతో కోహ్లీకి లైఫ్ లభించింది. ఆ తర్వాత, అర్షద్ ఖాన్ వేసిన 18వ ఓవర్లో ఒక ఫోర్, ఒక సిక్సర్ బాది ఆర్సీబీకి ఘనవిజయాన్ని అందించాడు. అంతకుముందు, టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ, కట్టుదిట్టమైన బౌలింగ్‌తో గుజరాత్‌ను సాధారణ స్కోరుకే పరిమితం చేసింది. గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు మాత్రమే చేయగలిగింది. వాషింగ్టన్ సుందర్ (50 నాటౌట్; 37 బంతుల్లో) ఒంటరి పోరాటం చేసి అర్ధశతకంతో ఆదుకున్నాడు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ దార్ 3 వికెట్లతో సత్తా చాటగా, భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఈ విజయంతో ఆర్సీబీ, ఆ జట్టు కెప్టెన్ రజత్ పటీదార్ అరుదైన ఘనత సొంతం చేసుకోవడం విశేషం. ఆర్సీబీ ఈ విజయంతో... వరుసగా రెండు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్ల సరసన చేరింది. కెప్టెన్ గానూ రజత్ పటీదార్ వరుసగా రెండు టైటిళ్లతో రికార్డు పుటల్లోకెక్కాడు. సీఎస్కే జట్టు 2010, 2011లో వరుసగా టైటిళ్లు గెలవగా... ముంబై ఇండియన్స్ 2019, 2020లో విజేతగా నిలిచింది. ఆర్సీబీ 2025, 2026లో టైటిళ్లు గెలిచి ఆ రెండు జట్ల సరసన చేరింది. 2025లో ఇదే స్టేడియంలో తొలి టైటిల్ గెలుచుకున్న ఆర్సీబీ.. చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ తర్వాత తమ టైటిల్‌ను నిలబెట్టుకున్న మూడో జట్టుగా చరిత్ర సృష్టించింది. అంతేకాకుండా, మహిళల ప్రీమియర్ లీగ్ (WPL), ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) టైటిళ్లను ఒకేసారి కలిగి ఉన్న ఏకైక ఫ్రాంచైజీగా అరుదైన ఘనత సాధించింది. క్వాలిఫయర్ 1లో గెలిచిన జట్టే ట్రోఫీని గెలుచుకోవడం ఇది వరుసగా తొమ్మిదోసారి.

## మరోసారి పెరిగిన కమర్షియల్ సిలిండర్ ధరలు

హైదరాబాద్ : దేశంలో కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధరలు మరోసారి పెరిగాయి. 19 కిలోల సిలిండర్‌పై చమురు మార్కెటింగ్ కంపెనీలు తాజా పెంపు ప్రకటించడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపారాలపై అదనపు భారం పడనుంది. అయితే గృహ వినియోగానికి ఉపయోగించే 14.2 కిలోల సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. ఢిల్లీలో రూ.42 పెరుగుదలతో కొత్త ధర రూ.3,113.50గా మారగా, కోల్‌కతాలో రూ.53.50 పెరిగి రూ.3,255.50కి చేరింది. ముంబైలో ధర రూ.3,024 దాటింది. అంతర్జాతీయ ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు, భౌగోళిక ఉద్రిక్తతలే ఈ పెంపునకు కారణమని నిపుణులు చెబుతున్నారు.

## ‘సర్’పై అప్రమత్తంగా ఉండండి

హైదరాబాద్: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)పై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. ఇతర రాష్ట్రాల్లో సర్ పేరుతో భాజపా ఏకపక్షంగా వ్యవహరించిందని, తెలంగాణలో అలాంటిది జరగకుండా కాంగ్రెస్ శ్రేణులన్నీ పోరాడాలని ఆయన చెప్పినట్లు సమాచారం. కర్ణాటకలోని కలబురిగి వెళుతూ విమానం మారడానికి శనివారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన ఆయన నోవాటెల్ హోటల్‌లో బస చేశారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం ఆయనతో అల్పాహార విందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షీ నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా జాతీయ, రాష్ట్ర రాజకీయాలపై కొద్దిసేపు చర్చించారు. ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం వివరాలు, పార్టీ కార్యక్రమాలను ఖర్గేకి మహేశ్‌కుమార్‌గౌడ్ వివరించారు. ఈ సందర్భంగా నాగార్జునసాగర్‌లో నాగార్జునకొండ వద్ద ఉన్న బుద్ధుడి మ్యూజియంను సందర్శించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఖర్గేను ఆహ్వానించినట్లు సమాచారం. ఆదివారం పౌర్ణమి సందర్భంగా అక్కడికి వస్తే బావుంటుందని సీఎం కోరినట్లు తెలుస్తోంది. కానీ ముందుగా నిర్ణయించిన కార్యక్రమాల వల్ల ప్రస్తుతం తాను రాలేనని, త్వరలో వస్తానని ఖర్గే తెలిపినట్లు సమాచారం. అనంతరం ఆయన కలబురిగి వెళ్లారు. ఈ నేపథ్యంలో నాగార్జునసాగర్‌లో కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్లతో సమావేశం ఏర్పాటుచేసి దీనికి ముఖ్యఅతిథిగా ఖర్గేను ఆహ్వానించాలని పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశం ఎప్పుడనేది త్వరలో ప్రకటించనున్నారు.

## బద్రీనాథ్ యాత్ర ట్రాఫిక్ కష్టాల్లో భక్తులు

పవిత్ర చార్‌ధామ్ యాత్రకు భక్తులు పోటెత్తడంతో బద్రీనాథ్ వెళ్లే మార్గంలో తీవ్రమైన ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో జోషీమఠ్ సమీపంలో దాదాపు 30 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వేలాది మంది యాత్రికులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయి నరకయాతన అనుభవిస్తున్నారు. చార్‌ధామ్‌తో పాటు హేమకుండ్ సాహిబ్ యాత్ర కూడా ఒకేసారి ప్రారంభం కావడంతో ఊహించని రీతిలో రద్దీ పెరిగింది. ఫలితంగా విష్ణుప్రయాగ్ సహా పలు కీలక ప్రాంతాల్లో వాహనాలు ముందుకు కదలడం లేదు. శనివారం ఒక్కరోజే జోషీమఠ్ సమీపంలోని ‘జీరో బ్యాండ్’ వద్ద 8 కిలోమీటర్ల పొడవున వాహనాలు బారులు తీరాయి. ఇరుకైన కొండ మార్గాల్లో గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో యాత్రికులు తిండి, నీరు, కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ భారీ రద్దీ కారణంగా అత్యవసర సేవలు అందించే అంబులెన్సులు సైతం ముందుకు కదలలేని దుస్థితి నెలకొంది. ఈ భీకర ట్రాఫిక్‌కు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అధికారులు, పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు జోషీమఠ్ వద్ద ‘గేట్ సిస్టమ్’ (వన్‌వే) విధానాన్ని అమలు చేస్తున్నారు. దీని కింద, ప్రతి 30 నిమిషాలకు ఒకవైపు వాహనాలను మాత్రమే అనుమతిస్తూ నెమ్మదిగా రద్దీని క్లియర్ చేస్తున్నారు. భక్తుల తాకిడి అధికంగా ఉన్నందున, యాత్రికులు తమ ప్రయాణాలను జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవాలని, అధికారుల సూచనలను తప్పక పాటించాలని పోలీసులు కోరుతున్నారు.

## అమెరికా డ్రోన్‌పై ఇరాన్ దాడి యుద్ధ వాతావరణం

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. తాజాగా తమ గగనతలంలోకి ప్రవేశించిన అమెరికాకు చెందిన ఎంక్యూ1 డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ఆదివారం ప్రకటించింది. శత్రుత్వ కార్యకలాపాలు నిర్వహించే ఉద్దేశంతో తమ జలాల్లోకి ప్రవేశించిన ఈ డ్రోన్‌ను వెంటనే గుర్తించి, గగనతల రక్షణ క్షిపణులతో కూల్చివేసినట్లు ఐఆర్‌జీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు పెరిగాయి. గత మంగళవారం కూడా అమెరికాకు చెందిన



ఎంక్యూ9 డ్రోన్‌ను తమ గగనతల రక్షణ విభాగాలు కూల్చివేశాయని ఐఆర్‌జీసీ తెలిపింది.

అమెరికా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే ప్రతీకారం తీర్చుకునే హక్కు తమకు ఉందని అప్పుడే ఇరాన్ హెచ్చరించింది. తమ గగనతలంలోకి ప్రవేశించిన ఒక యుద్ధ విమానంపై కూడా కాల్పులు జరిపినట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. మరోవైపు, ఇరాన్‌పై తాము ‘ఆత్మరక్షణ దాడులు’ చేసినట్లు అమెరికా ప్రకటించింది. సోమవారం దక్షిణ ఇరాన్‌లోని క్షిపణి ప్రయోగ కేంద్రాలు, మైన్‌లను అమర్చేందుకు ప్రయత్నిస్తున్న పడవలపై దాడులు చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్రకామ్) తెలిపింది. “మా దళాలను ఇరాన్ నుంచి వచ్చే ముప్పుల నుంచి కాపాడుకోవడానికే ఈ దాడులు నిర్వహించాం.

## ఇరాన్‌తో డీల్‌పై ట్రంప్ వెనకడుగు..

ఇరాన్‌తో అణు ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షతన వైట్‌హౌస్‌లో జరిగిన కీలక సమావేశం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీ నుంచి ట్రంప్ ఏ నిర్ణయం ప్రకటించకుండానే వెళ్లిపోయారని అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) పేర్కొంది. దీంతో ఇరు దేశాల మధ్య కుదిరిందని భావించిన తాత్కాలిక ఒప్పందం భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ సమావేశానికి ముందు ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, ఇరాన్‌తో ఒప్పందం జరగాలంటే కొన్ని కఠిన షరతులు విధించారు. సంఘర్షణల కారణంగా మూతపడిన హార్ముజ్ జలసంధిని తిరిగి తెరవాలని, ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయబోమని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను తమకు అప్పగించాలన్నది కూడా తమ ప్రధాన షరతుల్లో ఒకటని ట్రంప్ స్పష్టం చేశారు. అయితే, అమెరికా పెడుతున్న ఈ షరతులను ఇరాన్ మొదటి నుంచి వ్యతిరేకిస్తోంది. ఒకవైపు చర్చల ప్రక్రియ కొనసాగుతుండగానే, అమెరికా తన కఠిన వైఖరిని ప్రదర్శించింది. ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించడానికి తాము సిద్ధంగా ఉన్నామని అమెరికా యుద్ధ కార్యదర్శి పీట్ హెగ్సెత్ హెచ్చరించారు. సింగపూర్‌లో జరిగిన షాంగ్రీలా డైలాగ్‌లో ఆయన మాట్లాడుతూ.. “అవసరమైతే దాడులను పునఃప్రారంభించే సామర్థ్యం మాకుంది. మా ఆయుధ నిల్వలు అందుకు పూర్తిగా సిద్ధంగా ఉన్నాయి” అని వ్యాఖ్యానించారు. అధ్యక్షుడు ట్రంప్ ఒక మంచి ఒప్పందం కోరుకుంటున్నారని, కానీ ఇరాన్ అణు ఆశయాలను అరికట్టేలా అది ఉండాలని స్పష్టం చేశారు. మరోవైపు అమెరికా దౌత్యపరమైన హామీలపై తమకు నమ్మకం లేదని ఇరాన్ తెలిపింది. గతంలో చర్చలు జరుగుతున్నప్పుడే తమపై రెండుసార్లు దాడులు జరిగాయని గుర్తుచేసింది. ఇరాన్ రాయభారి మహమ్మద్ బఘేర్ ఖలీబాఫ్ మాట్లాడుతూ.. “మాకు హామీలు లేదా మాటలపై నమ్మకం లేదు, కేవలం చర్యలనే విశ్వసిస్తాం. చర్చల ద్వారా కాదు, క్షిపణుల ద్వారానే మాకు రాయితీలు లభిస్తాయి” అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ మాజీ కమాండర్ మొహసెన్ రెజాయీ కూడా ట్రంప్ ఉద్దేశాలను అనుమానించారు. దౌత్యానికి ట్రంప్ మూడోసారి ద్రోహం చేస్తున్నారని, చర్చల పేరుతో ఇతర లక్ష్యాలను నెరవేర్చుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ పరిణామాలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మళ్లీ పెరిగాయి.

## సూపర్ స్టార్ సేవలు చిరస్మరణీయం..

### కృష్ణకు సీఎం చంద్రబాబు ఘన నివాళి

సూపర్ స్టార్, పద్మభూషణ్ ఘట్టమనేని కృష్ణ జయంతి సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. తెలుగు సినీ పరిశ్రమకు కృష్ణ అందించిన సేవలను స్మరించుకుంటూ, ఆయనను ఓ గొప్ప నటుడిగా, దర్శకుడిగా, సాహసోపేత నిర్మాతగా కొనియాడారు. కృష్ణ జయంతిని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు తన అధికారిక ‘ఎక్స్’ ఖాతా ద్వారా స్పందించారు. తెలుగు సినిమాకు నూతన సాంకేతికతను పరిచయం చేయడంలో కృష్ణ ముందున్నారని, ఆయన కృషితోనే తెలుగు సినిమా కొత్త పుంతలు తొక్కిందని చంద్రబాబు ప్రశంసించారు. సినీ రంగ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ మేరకు తన ‘ఎక్స్’ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. “తెలుగు సినీ పరిశ్రమకు నటుడిగా, దర్శకుడిగా, సాహసోపేత నిర్మాతగా విశిష్ట సేవలందించిన పద్మభూషణ్ కృష్ణ గారి జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటున్నాం. నూతన సాంకేతికతలను తెలుగు సినిమాకు పరిచయం చేస్తూ సినీ రంగ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన ఆయన సేవలు చిరస్మరణీయం. అభిమానుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించిన ఆ మహానటుడికి ఘన నివాళులు” అని సీఎం చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

## వియత్నాం చేతికి ‘బ్రహ్మోస్’ అస్త్రం.. డీల్ ఖరారు చేసిన భారత్

రక్షణ రంగ ఎగుమతుల్లో భారత్ మరో కీలక మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి ‘బ్రహ్మోస్’ను వియత్నాంకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే తరహా ఒప్పందం ఇండోనేషియాతో కూడా తుది దశలో ఉందని భారత రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ వెల్లడించారు. సింగపూర్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక షాంగ్రీలా డైలాగ్ భద్రతా సదస్సులో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. “వియత్నాంతో బ్రహ్మోస్ ఒప్పందం ఇప్పటికే పూర్తయింది. బహుశా బహిరంగంగా ప్రకటించనప్పటికీ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఇండోనేషియాతో చర్చలు కూడా తుది దశకు చేరుకున్నాయి. త్వరలోనే ఒప్పందం ఖరారు కావచ్చు” అని రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు. నివేదికల ప్రకారం వియత్నాంతో కుదిరిన ఒప్పందం విలువ సుమారు రూ. 5,800 కోట్లు. ఇందులో భాగంగా తీరప్రాంత రక్షణ క్షిపణి వ్యవస్థలు, తొలి విడత క్షిపణులు, శిక్షణ, ఇతర సాంకేతిక సహకారం అందించనున్నారు. భవిష్యత్తులో వియత్నాం గగనతలం నుంచి ప్రయోగించే బ్రహ్మోస్ క్షిపణులను కూడా కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ సుమారు 375 మిలియన్ డాలర్ల విలువైన ఒప్పందంతో బ్రహ్మోస్‌ను కొనుగోలు చేసిన దేశంగా నిలిచింది. ఇప్పుడు వియత్నాం, త్వరలో ఇండోనేషియా కూడా ఈ జాబితాలో చేరనున్నాయి. దక్షిణ చైనా సముద్రంలో చైనాతో తీవ్రమైన ప్రాదేశిక వివాదాలు ఎదుర్కొంటున్న వియత్నాం, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలు తమ రక్షణ సామర్థ్యాన్ని పెంచుకుంటున్న తరుణంలో ఈ ఒప్పందాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ధ్వని కన్నా మూడు రెట్ల వేగంతో (మాక్ 3) ప్రయాణించే బ్రహ్మోస్ క్షిపణిని భూమి, గాలి, సముద్రం నుంచి ప్రయోగించవచ్చు. దీని వేగం, కచ్చితత్వం కారణంగా శత్రువుల యుద్ధ నౌకలను, కీలక సైనిక స్థావరాలను వేగంగా ఛేదించగలదు. 2020 గల్వాన్ ఘర్షణల తర్వాత చైనాతో సంబంధాలు ఉద్రిక్తంగా ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో తన వ్యూహాత్మక ప్రభావాన్ని పెంచుకోవాలని భారత్ భావిస్తోంది. రక్షణ ఎగుమతులను 2030 నాటికి రూ. 50,000 కోట్లకు చేర్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. మలేషియా, థాయ్‌లాండ్ వంటి ఇతర ఆగ్నేయాసియా దేశాలు కూడా బ్రహ్మోస్ కొనుగోలుపై ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

## ఆర్సీబీ విక్టరీపై ఆసక్తికరంగా స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం

ఐపీఎల్ 2026 ట్రోఫీని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) కైవసం చేసుకోవడంపై దేశవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండగా, కేంద్ర ఎన్నికల సంఘం (ECI) ఆసక్తికరంగా స్పందించింది. ఆర్సీబీ విజయాన్ని ఓటర్ల చైతన్యానికి వినూత్నంగా వినియోగించుకుంది. ఈ మేరకు ఈసీ అధికారిక సోషల్ మీడియా అకౌంట్ నుంచి ఒక ప్రత్యేక పోస్ట్ చేసింది. "ఐపీఎల్ 2026 ట్రోఫీని గెలుచుకున్న ఆర్సీబీకి అభినందనలు. ఛాంపియన్లు తమ సమయం కోసం సిద్ధంగా ఉంటారు. మీరు కూడా సిద్ధంగా ఉండాలి. 18 ఏళ్లు నిండుతున్నాయా? అయితే ఫారం 6 నింపి, ఛాంపియన్‌లా మీ ప్రజాస్వామ్య విధిని నెరవేర్చడానికి సిద్ధంకండి. మీ ఓటు విలువైంది" అని ఈసీ తన పోస్టులో పేర్కొంది. విరాట్ కోహ్లీ సహా ఆర్సీబీ ఆటగాళ్లు ట్రోఫీతో సంబరాలు చేసుకుంటున్న చిత్రాన్ని కూడా దీనికి జత చేసింది. యువతను ఓటు నమోదు దిశగా ప్రోత్సహించేందుకు ఈసీ చేపట్టిన 'సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్' కార్యక్రమంలో భాగంగా ఈ పోస్ట్ చేశారు. క్రీడలు, పండుగలు, సినిమాలను ఉపయోగించి యువతకు చేరువవ్వడం ఈసీ అనుసరిస్తున్న వ్యూహంలో భాగం.



# పలు శుభకార్యాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ఆదివారం నియోజకవర్గంలోని పలు శుభకార్యాల్లో పాల్గొని కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. శాయంపేట మండలం నేరేడుపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు పోరండ్ల చరణ్-నిఖిత దంపతుల కుమార్తె హన్సిత నూతన వస్త్ర, ఫల-పుష్పాలంకరణ కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం రేగొండ మండలంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు రహీమ్ సోదరుడి కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన గండ్ర వెంకట రమణారెడ్డి, వారి దాంపత్య జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్మీకి ఎంపికైన గీతేశ్వర్‌కు గండ్ర అభినందనలు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : భారత సైన్యంలో (ఇండియన్ ఆర్మీ) సేవలందించే అవకాశం దక్కించుకున్న భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కుందూర్‌పల్లికి చెందిన యువకుడు జరుపుల గీతేశ్వర్ను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ఆదివారం ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా గీతేశ్వర్‌కు శాలువా కప్పి సత్కరించిన గండ్ర, దేశ రక్షణకు అంకితభావంతో సేవలు అందించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు కృషి, పట్టుదలతో భారత సైన్యంలో స్థానం సంపాదించడం భూపాలపల్లి నియోజకవర్గానికే గర్వకారణమని పేర్కొన్నారు. యువత దేశభక్తి, క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు కటకం జనార్ధన్, జిల్లా నాయకుడు సెగ్గెం సిద్ధూ, మాజీ సైనికుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు బేతోజు మురళీకృష్ణ, జిల్లా అధ్యక్షుడు అభిషేక్ గుప్తా, ప్రస్తుతం సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న సైనికులు రఫీ, శ్రావణ్‌తో పాటు పలువురు నాయకులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

# విద్యతోనే సామాజిక, ఆర్థిక మార్పు

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : విద్య ద్వారానే సమాజంలో సామాజిక, ఆర్థిక మార్పులు సాధ్యమవుతాయని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను హైదరబాద్ పబ్లిక్ స్కూల్, రామంతాపూర్‌లో 1వ తరగతి ప్రవేశాల కోసం జిల్లా కు కేటాయించిన సీటుకు ఎస్సీ విద్యార్థి ఎంపిక ప్రక్రియను ఆది వారం పారదర్శకంగా నిర్వహిం చారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీకాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వ ర్యంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో అర్హులైన విద్యార్థుల పేర్లను పరిశీలించి ఎంపిక చేపట్టారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల విద్యా ర్థుల నుంచి మొత్తం 13 దరఖా స్తులు అందాయని తెలిపారు. జిల్లాకు కేటాయించిన ఒకే ఒక్క సీటుకు పలువురు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకు న్నందున పూర్తి పారదర్శకత, నిష్పక్షపాత ధోరణితో లక్కీ డ్రా నిర్వహించినట్లు చెప్పారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో చదివే అవకాశం లభించడం విద్యార్థి భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి విక్రమ్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అదనపు కట్నం వేధింపులు భరించలేక యువతి ఆత్మహత్య

జనగామ,ప్రజాస్ఫూర్తి : అదనపు కట్నం కోసం భర్త, అత్తింటి వారి వేధింపులు తట్టుకోలేక ఓ యువతి ఆత్మ హత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని ఎర్ర గొల్లపహాడ్ గ్రామం అజ్మీరా తండా లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపి న వివరాల ప్రకారం, కీసర మండలం లోని నాగారం గ్రామానికి చెందిన రాజే శ్వరి (23) కు గత సంవత్సరం మే 23న అజ్మీరా తండాకు చెందిన అ జ్మీరా నవీ న్ తో వివాహం జరిగింది. వివాహం అనంతరం అదనపు కట్నంగా రూ.10 లక్షలు తీసుకురావాలని భర్త నవీన్ తో పాటు అతని కుటుంబ సభ్యులు తర చూ వేధింపులకు గురి చేసినట్లు ఆరోప ణలు ఉన్నాయి. ఈ వేధింపులు భరించ లేక రాజేశ్వరి మే 29న ఇంట్లోనే గుర్తు తెలియని విషపదార్థం లేదా యాసిడ్ సేవించి ఆత్మహత్య కు పాల్పడినట్లు స మాచారం. అనంతరం కుటుంబ సభ్యు లు ఆమెను ఆసుపత్రికి తరలించి నప్ప టికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యు లు నిర్ధారించారు.మృ తురాలి తల్లి పా తులావత్ స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సం బంధించిన పూర్తి వివరాలు విచారణలో వెల్లడికానున్నాయి

# సరస్వతి అంత్య పుష్కరాలకు పటిష్ట భద్రత

*** డ్రోన్‌తో రద్దీ పర్యవేక్షించిన ఎస్పీ సంకీర్త్**





జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): సరస్వతి అంత్య పుష్కరాల సంద ర్భంగా కాళేశ్వరంలో భక్తుల రద్దీ భారీగా పెరిగిన నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ విస్తృత భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లు చేపట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ స్వయంగా పర్యవేక్షిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించారు. దేవాలయం పరిసరాల్లో ఏర్పాటు చేసిన క్యూ లైన్లు, పుష్కర ఘాట్‌లు, త్రివేణి సంగమం ప్రాంతాల్లో భక్తుల రాకపోకలను పరిశీలించిన ఎస్పీ, రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను డ్రోన్ కెమెరాల సహాయంతో పర్యవేక్షించారు. భక్తుల సంఖ్య, రద్దీ తీవ్రతను అంచనా వేసి అవసరమైన సూచనలు అధికారులకు అందించారు.భక్తుల వాహనాల రాకపోకలకు ఆటంకాలు కలగకుండా ప్రత్యేక పార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రదేశాలు, ఘాట్‌ల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించి ట్రాఫిక్‌ను సజావుగా నిర్వహించారు.అలాగే గోదావరి జలాల్లో బోటింగ్ నిర్వహించిన ఎస్పీ సంకీర్త్ భద్రతా పరిస్థితులను పరిశీలించారు. భక్తులు నదిలో లోతైన ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు.పుష్కర స్నానాల కోసం వచ్చిన భక్తులు సురక్షితంగా తమ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించుకునేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ నిరంతరం అవగాహన కల్పిస్తున్నారు. పుష్కరాలు ముగిసే వరకు ఇదే స్థాయిలో భద్రతా చర్యలు కొనసాగుతాయని పోలీసు అధికారులు తెలిపారు.

# జీవో నెంబర్ 7 ను బేషరతుగా రద్దు చేయాలి

*** మేకపోతుల నరేందర్ గౌడ్**



నల్గొండ, ప్రజాస్ఫూర్తి : నల్గొండ జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షులు చిలకరాజు సతీష్ కుమార్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేంద్ర గౌడ్ విచ్చేసి మాట్లాడుతూ బీసీల సంక్షేమం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు రాజకీయ, విద్యా, ఆర్థిక రంగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. బీసీల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టి, వారి హక్కులను పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై మాట్లాడుతూ, ప్రభుత్వం బకాయిలను సకాలంలో విడుదల చేయకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అర్హులైన ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు పూర్తిస్థాయిలో అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వాలు బీసీల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్య వైఖరి మరియు జీవోనెంబర్ 7 ను రద్దు చేసే అంతవరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని మేకపోతుల నరేందర్ గౌడ్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొండ రామకృష్ణంరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి నీలం వెంకట మధు, రాష్ట్ర లీగల్ అడ్వైజర్ చొల్లేటి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్త లింగస్వామి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు సత్యనారాయణ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు వెంపటి నరసింహ జిల్లా నాయకులు దొండ సాంబయ్య, ఊళ్లేందుల అంజయ్య, డబ్బికార్ రాజా, కృష్ణ యాదవ్, కాస్పరాజ్ జానీ, మధు, గడ్డం మారయ్య, రేక్య నాయక్, కొత్తకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గూడు కట్టేటోళ్ల గోడువిందాం హక్కుల సాధనకై పోరాడుదాం

*** భవన నిర్మాణరంగ కార్మికుల సంఘం 10 వ జిల్లా మహాసభ**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ పట్టణంలోని క్రిస్టల్ గార్డెన్ లో గూడు కట్టేటోల్ల గూడు విందాం హక్కుల సాధనకే పోరాడుదాం అనే నినాదంతో భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం 10 వ జిల్లా మహాసభ ను మెదక్ జిల్లా లో ఆదివారం ఘనంగా నిర్వహించారు.భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, సిద్దిపేట్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ దరిపల్లి చంద్రం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సమాజానికి అందమైన రాజభవనాలు కట్టి మనకి కనీసం నీడలేని పరిస్థితులు ఈ రాష్ట్రంలో నెలకొందన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మన శక్తి సామర్థ్యాలతో నిర్మించిన భవనాలే కదా మన సృష్టి అని అన్నారు. వెల్ఫేర్ బోర్డుకు మా కార్మికుడిని చైర్మన్ గా నియమించాలన్నారు. ప్రతి ఉమ్మడి జిల్లాకి ఈఎస్ఐ హాస్పిటల్ సౌకర్యం కల్పించాలన్నారు. నిజమైన కార్మికులను గుర్తించి పది లక్షల వరకు పనిముట్లు మీద లోను సౌకర్యం కల్పించాలన్నారు. 55 సంవత్సరాలకే 5000 పెన్షన్ సౌకర్యం కార్మిక వెల్ఫేర్ బోర్డ్ నుండి కల్పించాలన్నారు. కార్మికుల పిల్లలకు స్కాలర్షిప్ సౌకర్యం కల్పించాలనీ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కార్మిక శాఖ మంత్రిగా ఉన్న వివేక్ వెంకటస్వామి కార్మికులను పట్టించుకునే పాపాన పోలేదని అన్నారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ మెరుగు మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతి శేశవులు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెలిమెల రాములు, పట్టణ గౌరవాధ్యక్షులు మన్నే రామచందర్, పట్టణ అధ్యక్షుడు నాయికోటి శేఖర్, పట్టణ ఉపాధ్యక్షులు కుమ్మరి యాదగిరి, పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకరి లింగం, పట్టణ ఉప కార్యదర్శి ధన శేఖర్, పట్టణ కోశాధికారి భూత్కూరి యాదగిరి, పట్టణ ఉప కోశాధికారి బుద్ధి ఏసయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి అల్లం సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు మల్లేశం, కొంగోటి అంజయ్య, పడమటి రాందేవ్, మేకల కృష్ణ యాదవ్, ఆకారం యాదగిరి, మేరు పెంటయ్య, నాగారం నరసింహులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ లో చేరిన మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఈడ్దుల విజయ్ కుమార్ యాదవ్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం గ్రామానికి చెందిన, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈడ్దుల విజయ్ కుమార్ యాదవ్ ఆదివారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి సమక్షంలో, దండు మల్కాపురం సర్పంచ్ గిర్కాటి నిరంజన్ గౌడ్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ముదిగొండ వెంకటేష్ ల ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఈడ్దుల విజయ్ కుమార్ యాదవ్ గ్రామంలోని 40 కుటుంబాలతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట ప్రభాకర్ రెడ్డి గులాబీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఇబ్బందులను తట్టుకోలేకనే బయటకు వస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో మాసిన కిష్టయ్య, పగిళ్ల నరేష్, రాచర్ల సందీప్, మాసిన మల్లికార్జున్, గొలుసుల గిరి, మాసిన శ్రీశైలం, బసిరెడ్డి మల్లారెడ్డి, మాసిన రమేష్, చింతపట్ల రాజశేఖర్, రాసాల మహేష్, వాడపల్లి వజ్రేష్, గొలుసుల శివ, గొలుసుల శ్రీశైలం, పగిళ్ల ఉపేందర్, మహేందర్, డాకోజు వంశీ, డాకోజీ శశి, డాకోజి సుశాంత్, సింగనమని బన్నీ, గోపి వంశి, గోపి మధు, గోలి శివమణి, ఈడ్దుల వంశీ, రుద్రారం శివ, చిట్టంపల్లి జగన్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచి మల్కాజ్గిరి కృష్ణ, వార్డు సభ్యులు ఈడ్దుల రాంప్రసాద్, పొట్లపల్లి శివకుమార్, కొత్త మహేష్, చిట్టంపల్లి సాయికుమార్, సంఘం నరసమ్మ చంద్రయ్య, జొన్నగంటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు యెన్నం




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. జూన్ 2న నిర్వహించే అధికారిక వేడుకల్లో ప్రభుత్వ విప్, యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు జిల్లాల వారీగా రాష్ట్ర ప్రభుత్వం అతిథులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర అవతరణకు దారితీసిన ఉద్యమ స్ఫూర్తిని చాటేలా నిర్వహించనున్న ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, విద్యార్థులు పాల్గొననున్నారు. జిల్లా కేంద్రంలో జరిగే ప్రధాన కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేకంగా ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది.

# నిరంతరం ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారులపై ఒత్తిడి తీసుకువస్తాం

*** మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి**



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి : ప్రజల సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం ప్రజల మధ్య ఉంటూ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తామని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ వినాయక్ నగర్ కాలనీలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు , కాలనీ ప్రజలతో కలిసి విస్తృత స్థాయి ప్రజా పర్యటన నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ స్థానికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా కాలనీలో తాగునీటి కొరత , పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయి పడి ఉన్నాయని, పారిశుధ్య సమస్య, ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కూడా పలువురు స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు దీంతో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, గృహ నిర్మాణ పథకాల వంటి అంశాల్లో ప్రజలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి,కొల్తూరి మహేష్, కౌడే పోచయ్య, నాయకులు జావీద్ ఖాన్, ఆకుల మధుకర్, మల్లం వెంకటేష్, మేడబోయిన విజయ్ కుమార్, తిరుపతి రెడ్డి, అక్కల శ్రీనివాస్, ఆంజనేయులు, యాసారం శ్రీనివాస్, శ్యామల శ్రీనివాస్, బుల్లెట్ శంకర్,మునికుంట్ల కిరణ్ గౌడ్, కోనేటి వెంకన్న, పింగళి జోగిరెడ్డి, గడీల జగన్ రెడ్డి, పాశం నరేందర్ రెడ్డి,సతీష్, శ్రీనివాస్ రెడ్డి, రాయాల అశోక్, అమర్ పటేల్, తిరుమలేష్,మధుసూదన్, పుల్ల శ్రీనివాస్, వారికల శ్రీనివాస్, కైసర్, తదితరులు పాల్గొన్నారు.

# రైతు డిస్కం పేరిట విద్యుత్తు ప్రైవేటీకరణకు కుట్ర: కె.కవిత

ఫిల్మ్‌నగర్ : రాష్ట్రంలో రైతు డిస్కం ఏర్పాటు పేరుతో విద్యుత్తు రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే కుట్ర జరుగుతోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'ఆరు నెలలుగా రహస్యంగా ఉంచిన రైతు డిస్కం అంశాన్ని ఇప్పుడు బయటపెట్టడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలున్నాయి. రైతుల అభిప్రాయాలు తీసుకోకుండా రైతు డిస్కం ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం' అని పేర్కొన్నారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారి చేయి తొలగించిన ఘటనపై ప్రభుత్వం బాధ్యత వహించాలని, బాధిత చిన్నారి పేరుపై రూ.25 లక్షలు డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

# చెస్ పోటీలు విద్యార్థులలో మేధాశక్తిని పెంచుతాయి

*** జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: చెస్ పోటీలు విద్యార్థులలో మేధాశక్తిని పెంపొందిస్తాయని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు గండూరి కృపాకర్, కార్యదర్శి సతీష్ కుమార్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టిటిడి కళ్యాణ మండపం నందు ఆదివారం సాయంత్రం జిల్లా స్థాయి అండర్ 9,15 చెస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చదరంగం భారతదేశంలో పురాతన కాలం నుండి ప్రసిద్ధి చెందినదని అన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్ లకి బానిసలు కాకుండా ఆటల పట్ల ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. క్రీడల వలన విద్యార్థులు చదువులో కూడా చురుగ్గా తయారవుతారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థులు ఆధునిక సాంకేతికతను నేర్చుకోవాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో అండర్ 9 బాలికల విభాగంలో వై ఎస్ కోమల్, అక్షితా రెడ్డి, చైత్ర , బాలుర విభాగంలో యజత్ రెడ్డి, తన్విష్, చరిత్, గిగ్నేష్ దేవ్ వర్మ, అండర్ 15 బాలికల విభాగంలో చిద్విలాసిని, ఇందిర, అనంత లక్ష్మి, బాలుర విభాగంలో రక్షిత్ చారి, ఆర్యన్ వర్మ, అఖిలేష్, గౌతమ్ కృష్ణ లు విజేతలుగా నిలిచారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి లి రంగారెడ్డి, సాయి కుమార్, జానయ్య, కొండ నరసింహరావు, ఖాసిం ఆర్బిటర్, అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విత్తనాలు కొనేటప్పుడు బిల్లు తప్పనిసరి

*** జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ డాకూరి వెంకటేశం**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: రైతులు విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదు (బిల్లు) తీసుకోవాలని జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ డాకూరి వెంకటేశం సూచించారు.ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ.. విత్తనాల ప్యాకింగ్ కవర్లు, కొనుగోలు బిల్లులను పంట పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలని రైతులకు సూచించారు. విత్తనాలు మొలకెత్తకపోయినా, ఆశించిన దిగుబడి రాకపోయినా నష్టపరిహారం పొందేందుకు ఇవి ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు.అలాగే ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విత్తనాలు విక్రయించినా, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు గుర్తించినా వెంటనే వ్యవసాయ శాఖ, లీగల్ మెట్రాలజీ అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. వినియోగదారులకు అవసరమైన సమాచారం, సూచనలు అందించేందుకు జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కింది ఫోన్ నెంబర్ కు సంప్రదించగలరని తెలిపారు. 9908948242.

# దళిత వాడకు మిషన్ భగీరథ నీళ్లు





మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులో ఉన్న దళితవాడ కాలనీకి గత అనేక సంవత్సరాలుగా మిషన్ భగీరథ నీళ్లు రాకుండా కేవలం బావి నీరు అవి కూడా మురికి నీళ్లు వచ్చేవి. "భగీరథ నీళ్లున్నా దళితవాడకు మురికి నీళ్ళు అనే వార్త పత్రికలో రావడంతో పత్రికల్లో ఇచ్చిన కథనాన్ని గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయంలో ఖాదర్ బాబా ఫిర్యాదుతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ నీళ్లు దళిత కాలనీకి అందించాలని కోరుతూ ధర్నా కూడా చేశారు.దీంతో జిల్లా కలెక్టర్ దళిత కాలనీకి మిషన్ భగీరథ నీళ్లు అందించాలని మునిసిపల్ కమిషన్ ఆదేశించడంతో కాలనీకి మిషన్ భగీరథ పైపులైన్ వేసి ఆదివారం మిషన్ భగీరథ నీటిని కాలనీకి అందించడంతో నల్లాల ద్వారా మిషన్ భగీరథ నీటిని పట్టుకున్న ప్రజలు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు మున్సిపాలిటీ సిబ్బంది, భుక్య రాంజీ, షేక్ ఖాదర్ బాబా, సురేష్, వర్క్ ఇన్స్పెక్టర్ జగన్. పీటర్ శ్రీను, డిఎ గంగుల శ్రీను, వాటర్మెన్ పాల్గొన్నారు.

# విద్యుత్ కాంతులతో ముస్తాబైన జిల్లా కలెక్టరేట్



జనగామ, ప్రజాస్ఫూర్తి : రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించు కుని జిల్లా కలెక్టరేట్ భవనం విద్యుత్ దీపాల అలంకరణతో సర్వాంగ సుంద రంగా ముస్తాబైంది.రంగురంగుల విద్యు త్ కాంతులతో ప్రకాశిస్తున్న కలెక్టరేట్ భవనం సందర్శకులను విశేషంగా ఆక ట్టుకుంటోంది.రాష్ట్ర అవతరణ దినోత్స వాన్ని ఘనంగా నిర్వ హించేందుకు జి ల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేప ట్టింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగ ణాన్ని విద్యుత్ దీపాల తో అలంకరించ డంతో రాత్రి వేళల్లో భ వనం కనువిందు చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రగతి, అభి వృద్ధికి ప్రతీకగా నిలిచిన రాష్ట్ర అవత రణ దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రభు త్వ కార్యాలయాలను ప్రత్యేకంగా అలం కరిస్తుండగా, జిల్లా క లెక్టరేట్ కూడా వి ద్యుత్ కాంతుల వెలు గులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజలు, అధికారు లు ఈ అందమైన దృశ్యాలను ఆస్వాది స్తూ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభా కాంక్షలు తెలియ జేస్తున్నారు.

# బాసర త్రిబుల్ ఐటీ కి కిష్టాపూర్, కలమడుగు విద్యార్థుల ఎంపిక



ప్రజాస్ఫూర్తి,జన్నారం : జన్నారం మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు, కలమడుగు ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బాసర త్రిబుల్ ఐటీ కి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, కట్ట రాజమౌళి తెలిపారు. కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన లశెట్టి శ్వేత, కట్ల సాకేత,చెరుకు అక్షయ్ అనే ముగ్గురు విద్యార్థులు, కలమడుగు ప్రభుత్వ పాఠశాలకు చెందిన జాడి ఆంజనేయ ప్రసాద్, అయ్యోరు వైష్ణవి అను ఇద్దరు విద్యార్థులు బాసర త్రిపుల్ ఐటీ కి ఎంపికయ్యారని అన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, కట్ట రాజమౌళి మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు బాసర త్రిబుల్ ఐటీ లో ఆరేళ్లపాటు ఉచితంగా ఇంజనీరింగ్ విద్యను అభ్యసిస్తారని తెలిపారు తెలిపారు. ఈ విద్యార్థులు పదవ తరగతిలో కూడా లశెట్టి శ్వేత (582), కట్ల సాకేత (577), చెరుకు అక్షయ్(567), జాడి ఆంజనేయ ప్రసాద్ (577), అయ్యోరు వైష్ణవి (563) అత్యధిక మార్కులు సాధించారని తెలిపారు బాసర త్రిబుల్ ఐటీ ఎంపికైన ఈ విద్యార్థులను ఎంఈఓ విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు గుండ రాజన్న, కట్ట రాజమౌళి కిష్టాపూర్ సర్పంచ్ వాసాల నరేష్ ,ఆదర్శ పాఠశాలల చైర్మన్ మంగ, ఉపాధ్యాయులు జాడి మురళి, దాముక కమలాకర్, బాణావత్ ప్రకాష్, గుండి నరహరి శర్మ, వావిలాల వాసులతో పాటు ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

# బక్రీద్ ఏర్పాట్లపై కలెక్టర్‌కు అభినందనలు

**: ముస్లిం డెవలప్మెంట్ కమిటీ.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : బక్రీద్ (ఈద్ ఉల్ అజ్హా) సందర్భంగా పట్టణం లోని ఈద్గా వద్ద భక్తుల సౌకర్యార్థం టెంట్ ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్ క్యాంప్, ఫైర్ ఇంజన్, తాగునీటి సదుపాయాలు కల్పించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ జిల్లా అధ్యక్షులు జమాల్ షరీఫ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ, ఈద్గా వద్ద తీవ్రమైన ఎండల నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్‌లను ఆదేశించి టెంట్ ఏర్పాటు చేయించిన కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మెడికల్ క్యాంప్, అగ్నిమాపక వాహనం, తాగు నీటి వంటి మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా ముస్లిం సోదరులకు ఎంతో ఊరట నిచ్చారని పేర్కొన్నారు. బక్రీద్ సందర్భంగా ఈద్గా వద్ద తొలిసారి గా టెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, దీనివల్ల ప్రార్థనలకు హాజరయ్యే వేలాది మంది భక్తులకు సౌకర్యం కలిగిందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఘనంగా "ప్రతిభ పురస్కారం" కార్యక్రమం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : 202526 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి ఫలితాలలో మహబూబాబాద్ జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులతో పాటు తమ తమ పాఠశాలల్లో టాపర్లుగా నిలిచిన ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులను సన్మానిస్తూ మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "ప్రతిభ పురస్కారం" కార్యక్రమం ఘనంగా నిర్వహించ బడింది.అసోసియేషన్ అధ్యక్షుడు గందు మురళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గందు మురళి మాట్లాడుతూ,ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రైవేట్ టీచర్ల సంక్షేమమే అసోసియేషన్ ప్రధాన లక్ష్యమని,పరస్పర సహకారం, ఐక్యతతో సంస్థ నిరంతరం అభివృద్ధి చెందుతూ అవసరమైన సమయంలో ఉపాధ్యాయులకు ఆర్థిక సహాయం కూడా అందిస్తోందని తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి మాట్లాడుతూ, విద్యార్థులు ఒక విజయాన్ని సాధించిన తర్వాత అక్కడితో ఆగిపోకుండా మరింత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు.24వ వార్డు కౌన్సిలర్ దిలీప్ మాట్లాడుతూ,పదవ తరగతి అనంతరం విద్యలో పోటీ తీవ్రంగా ఉంటుందని, అయితే నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసంతో ప్రతి విద్యార్థి లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని కోరారు.శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ మదార్ మాట్లాడుతూ, లక్ష్యసాధనలో ఎదురయ్యే ఒడిదుడుకులకు భయపడకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మార్గదర్శకత్వంలో తమ కలలను సాకారం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.26వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్య మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా సమాజంలోని మార్పులు, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిని అవగాహన చేసుకుని వాటిని తమ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీస్ గురుకులాలు, మహాత్మ జ్యోతిబా పూలే గురుకులాలు, కస్తూర్బా పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన మొత్తం 15 మంది జిల్లా మరియు పాఠశాల టాపర్లను పూల బొకేలు, శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు వెంకన్న,ఎం. రాంబాబు,ఎండి సలీం, డి. సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, మైనారిటీ పాఠశాల ఉపాధ్యాయుడు ఇమాముద్దీన్ మొహమ్మద్ పాల్గొన్నారు.



# వైభవంగా ప్రగతి విద్యాలయం 1996-97 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : సుమారు మూడు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత ఆ పాత స్నేహితులు మళ్లీ ఒక్కటయ్యారు. ప్రగతి విద్యాలయం షాద్నగర్ 1996 97 విద్యా సంవత్సరానికి చెందిన నాటి విద్యార్థులు అందరూ కలిసి షాద్‌నగర్ నియోజకవర్గం ఈదులపల్లి శివారులోని కోకో ప్లమ్స్ రిసార్ట్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా సాగింది. ప్రగతి విద్యాలయంలో ఆనాడు తక్కువ ఫీజుతో విద్యార్థులు చదివి ఈనాడు అంచలంచలుగా ఎదిగిన విద్యార్థులను చూసి ఎంతో గర్వంగా ఉందని అన్నారు. చదువు పూర్తయ్యాక వివిధ రంగాల్లో, వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన నాటి స్నేహితులు.. ఈ వేదిక ద్వారా ఒకే చోట చేరడంతో రిసార్ట్ ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. చిన్ననాటి అల్లరి పనులు, తరగతి గది జ్ఞాపకాలు, గురువుల శిక్షణ, ఆటపాటలను గుర్తుచేసుకుంటూ నాటి విద్యార్థులు ఆనంద డోలికల్లో తేలియాడారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు రాధాకృష్ణ, నరేందర్, మధు సుదన్, మహమూద్ , కొండారెడ్డి, శశికాంత్, త్రివేణి లు మాట్లాడుతూ ఒక గురువుకు తన జీవితంలో లభించే అసలైన అవార్డు, గుర్తింపు.. తన చేతుల్లో పెరిగిన విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడటమే అన్నారు. సుదీర్ఘ కాలం తర్వాత జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనం అందరి హృదయాల్లో ఒక మధురమైన జ్ఞాపకంగా నిలిచిపోయింది.

# కాసాని ఆశయాల సాధనే నిజమైన నివాళి

**: బీవీ రాఘవులు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటమే దివంగత కమ్యూనిస్టు నాయకుడు కాసాని ఐలయ్యకు ఘన నివాళి అని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. కొత్తగూడెం, సుజాతనగర్‌లో ఏర్పాటు చేసిన కాసాని ఐలయ్య స్మారక స్తూపాలను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు, దోపిడీ లేని సమాజం కోసం కాసాని తన చివరి శ్వాస వరకు పోరాడారని కొనియాడారు.అనంతరం కొత్తగూడెం నుంచి సుజాతనగర్ వరకు సీపీఎం శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, కాసాని ఆశయాలను కొనసాగిస్తామని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎం. సాయిబాబు, బి. వెంకట్, పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, అన్నవరపు సత్యనారాయణ తదితర సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో దాతలకు సన్మానం



నలగొండ, ప్రజాస్ఫూర్తి : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు సేవ చేసే భాగ్యం దొరకడం అదృష్టమని శ్రీ సత్య సాయి సేవ సమితి నల్గొండ కన్వీనర్ పున్న విశ్వేశ్వర్ అన్నారు.గత 28 సంవత్సరాలుగా హైదరాబాదు రోడ్ లోని తిరుమల థియేటర్ ఎదురుగా సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో బాటసారుల, కార్మికుల ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం నిర్వహిస్తున్నామని, చలివేంద్రంలో మంచినీరే కాక మజ్జిగ నిమ్మరసం పంపిణీ చేశామని అన్నారు. ఈ సంవత్సరం 53 రోజులుగా నిరాటంకంగా సత్య సాయి సేవ సమితి స్త్రీ పురుష సేవాదళ్ సభ్యులు సేవలు అందించడం జరిగిందని, తమ సంస్థకు ప్రతి సంవత్సరం సహకరిస్తున్న పల్లెర్ల యాదగిరి కుటుంబ సభ్యులను సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు.

# హెల్త్ కార్డు కోసం వేతనాల కోతను ఖండిస్తున్నాం

*** టిఎస్‌యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఈహెచ్‌ఎస్ చందా పేరిట ఉద్యోగుల మే నెల వేతనాల్లో 1.5% కోత విధించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. పాల్వంచలోని సంఘ కార్యాలయంలో మండల అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాలు ఖరారు చేయకుండా, హాస్పిటల్స్‌తో ఒప్పందం కుదుర్చుకోకుండా, ప్యాకేజి రేట్లు నిర్ణయించకుండా, డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేయకుండా వేతనాల్లో కోత విధించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. వేతనంలో 1.5% కోత నిర్ణయం పట్ల ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారని, వారిలో ఉన్న సందేహాలను తొలగించి ఆరోగ్య పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం, డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి వెంటనే జోక్యం చేసుకొని వేతనాల్లో కోతలు నిలిపివేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్.కె.యాకూబ్ పాషా, మండల ప్రధాన కార్యదర్శి జి.హరి సింగ్, ఉపాధ్యక్షులు ఏ.విజయ భాస్కర్, సత్య శ్రీ, అంబికా జాదవ్, ఎం.రాజులు, టి.వెంకన్న, వి.టి.ఆర్ మోహన్ రావు, బి.మంగీలాల్, సమ్మయ్య, టి.బాలు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు, తరలింపు వేగవంతంగా చేయాలి

* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**





జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవం తం చేయడం తోపాటు కొనుగోలు చేసి న ధాన్యాన్ని వెంటనే మిల్లులు, గోదా ములకు తరలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధి కారులను ఆదేశించారు.ఆదివారం పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికం గా తని ఖీ చేసిన కలెక్టర్, మరోవైపు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం లో నిర్వహిం చిన సమీక్ష సమావేశంలో కొనుగోళ్లు, రవాణా ఏర్పాట్లపై అధికా రులతో చర్చించారు. జనగామ, నర్మెట్ట, తరిగొప్పుల మండలాల్లోని ఐకేపీ, పీఏ సీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ అడవికేశవాపూర్, ఎర్రగొల్ల పహాడ్, షామీర్‌పేట్,వడ్లకొండ, గానుగుపహాడ్,వెంకిర్యాల,వెల్దండ,అమ్మాపూర్,హన్మం తాపూర్, పోతారం, సోలిపూర్, తరిగొప్పుల,అడివికేశవపూ ర్ తదితర గ్రామాల్లో కొనుగోలు ప్రక్రియ ,ధాన్యం నిల్వలు, రవాణా ఏర్పాట్లు, రైతులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అకాల వర్షాల నేపథ్యం లో ధాన్యం బస్తాలను టార్పాలిన్ల తో కప్పి భద్రపరచాలని ఆదేశించారు. కేంద్రాల్లో నిర్వహిస్తున్న రిజిస్టర్లు,ట్రక్ షీట్లు ,ఓపీఎంఎస్ నమోదులను పరిశీలించిన కలెక్టర్, రవాణాకు అవసరమైన లారీల ను అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోళ్లు నిర్దేశిత గడువు లోపు పూర్తి చేసి ప్రతి రైతుకు సకాలంలో లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని పేర్కొ న్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్, అకాల వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ధాన్యాన్ని త్వ రితగతిన కొనుగోలు చేసి మిల్లులకు త రలిస్తున్నామని తెలిపారు. రైతులు ఆం దోళన చెందాల్సిన అవసరం లేదని,ప్ర తి గింజను కొనుగోలు చేసి రైతు ప్రయో జనాలను పరిరక్షించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడిఉందని భరోసా ఇచ్చా రు. అనంతరం జిల్లా సమీ కృత కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (రెవె న్యూ) బెన్ షా లోమ్ తో కలిసి నిర్వ హించిన సమీక్ష సమావేశంలో ధాన్యం కొనుగోళ్ల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు 27,141మం ది రైతుల నుంచి 1.67 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం కొనుగోలు చేసిన ట్లు తెలిపారు.ఇందులో 1.60 లక్షల మె ట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే రైస్ మిల్లులకు తరలించగా, 26,097మంది రైతుల ఖాతాల్లో రూ.312 కోట్లను జమ చేసినట్లు వెల్ల డించారు. ధాన్యంలో 80 శాతం ట్యాగ్ చేసిన రైస్ మిల్లులకు, 20 శాతం గుర్తిం చిన గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అద నంగా 50 ట్రాక్టర్లను రవాణాకు వినియో గంలోకి తీసుకురావాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఓ భాస్కర్,పౌరస రఫరాల సంస్థ డీఎం హతిరామ్, జిల్లా మార్కెటింగ్ అధికారి రామకృష్ణ, డీసీ ఎస్‌ఓ సురేష్‌రెడ్డి, రవాణా శాఖ అధికా రి శ్రీనివాస్ గౌడ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కబ్జాకు గురైన చెరువులను కాపాడాలి




ప్రజాస్ఫూర్తి ,జన్నారం : జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామంలో కబ్జాకు గురైన చెరువులను కాపాడాలని ఆ గ్రామానికి చెందిన పలువురు కోరారు. జన్నారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ కార్యాలయంలో ఆదివారం రోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని రేండ్లగూడ గ్రామంలోని సర్వే నెంబర్ 159,160,161 లో ఉన్న అల్లం వారి చెరువు,గొల్లకుంట చెరువు మరియు ఊరకుంట చెరువులు కబ్జాకు గురయ్యాయని, 20 ఎకరాలకు పైగా ఉన్న అల్లం వారి చెరవు ఇప్పుడు 2 ఎకరాలు ఉందని, 10 ఎకరాలు ఉన్న గొల్ల కుంట చెరువు ప్రస్తుత మూడు ఎకరాలు ఉందని అన్నారు.చెరువులు కబ్జా కావడంతో నీరు లేక పొలాలు ఎండిపోయి రైతులు నష్టపోతున్నారని,ప్రజలు, పశువులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కబ్జా చేసిన చెరువులను లక్షల్లో అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కావున మాయందు దయతలచి చెరువులను సర్వే చేసి శాశ్వత హక్కు మాకు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని అన్నారు.ఈ కార్యక్రమంలో సముద్రాల శంకర్, ఆకుల భీమన్న, ఆకుల సత్తవ్వ, లతీఫ, హబీబాబేగం, ఆకుల రజిత, బాల్త సువర్ణ,బాల్త వెంకవ్వ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు పై కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ డెడ్‌లైన్

* **జూన్ 1 నుంచి ఆందోళనలు చేపడతామని డాక్టర్ రాజయ్య హెచ్చరిక..**



జనగామ, ప్రజాస్ఫూర్తి: రాష్ట్రం లో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, గన్నీ బ్యాగుల కొరత, రవాణా సమస్యల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయ కులు ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్ల ను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ డెడ్‌లైన్ విధించింది. రఘునాథపల్లి మండలంలోని అశ్వరావు పల్లి, వెల్ది గ్రామాల ఐకేపీ కొనుగోలు కేంద్రాలను మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సందర్శించి రైతుల సమస్యలను తెలు సుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగో లు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్య మే కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై రెండు నెలలు గడిచినా ధాన్యం పెద్ద ఎత్తున కేంద్రాల్లోనే నిల్వ ఉండి పోవడం ఆందో ళన కలిగిస్తోందన్నారు. గన్నీ బ్యాగుల కొరత,రవాణా వాహనాల లేమి,మౌలిక సదుపాయాల కొరత కారణంగా రైతు లు ఇబ్బందులు పడుతున్నారని విమ ర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన గడు వులోగా కొను గోళ్లు పూర్తి కాలేదని, వెం టనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జూన్ 1వ తేదీ నుంచి రైతులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని అయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎర్రోళ్ల కుమార్ గౌడ్, మాజీ మా ర్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, మాజీ సర్పంచ్ పెండ్లి మల్లారెడ్డి, గూడ కిరణ్, కొర్ర రాజేందర్ నాయక్, ఎడ్ల బాలరాజు, గోనె మల్లారెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

* **15 మంది అరెస్ట్.. రూ.1.58 లక్షలకు పైగా నగదు స్వాధీనం**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో పేకాట స్థావరాలపై పోలీసులు నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో 15 మంది పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. రెండు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన ఈ దాడుల్లో మొత్తం రూ.1.58 లక్షలకు పైగా నగదు, పలువురు నిందితుల సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ములకలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మంపేట గ్రామ శివారులో నిర్వహించిన దాడిలో 9 మంది పేకాట ఆడుతూ పోలీసులకు చిక్కారు. వారి వద్ద నుంచి రూ.1,09,450 నగదు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ఇల్లందు పోలీస్ స్టేషన్ పరిధిలో**

అదే విధంగా, ఇల్లందు పోలీస్ స్టేషన్ పరిధిలోని ముకుందాపురం గ్రామంలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఈ దాడిలో 6 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.48,920 నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను ఇల్లందు పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, సబ్‌ఇన్స్పెక్టర్లు ప్రవీణ్, సుమంత్, రామారావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## జిల్లాలో రోప్ స్కిప్పింగ్ అభివృద్ధికి కార్యాచరణ




జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లో రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ సాధారణ సర్వసభ్య సమావేశం జిల్లా కేంద్రం లోని సెయింట్ మేరీస్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి అసోసియేషన్ ప్రతి నిధులు, వివిధ పాఠశాలల వ్యా యామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు హాజరయ్యారు.ఈ సమావేశంలో జిల్లా లో రోప్ స్కిప్పింగ్ క్రీడ విస్తరణ, విద్యార్థుల్లో క్రీడాపట్ల అవ గాహన పెంపు, గ్రామీణ, పట్టణ ప్రాంతా ల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించే అంశాలపై చర్చిం చారు. త్వరలో సబ్ జూనియర్,జూని యర్,సీనియర్ విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలను నిర్వహించాలని నిర్ణయించా రు. క్రీడాకారుల నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేక కోచింగ్ క్యాంపులు నిర్వహించేందుకు తీర్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్ పటేల్, రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్, జిల్లా చైర్మన్ బొల్లం అజయ్, జిల్లా అధ్య క్షులు కుమార్, జిల్లా కార్యదర్శి తిరు మలేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రోప్ స్కిప్పింగ్ కేవలం వ్యాయామం మాత్ర మే కాకుండా అంతర్జాతీయ స్థాయి లో గుర్తింపు పొందిన క్రీడ అని పేర్కొన్నా రు. విద్యా ర్థుల్లో శారీరక దృఢత్వం, ఏ కాగ్రత, క్రమ శిక్షణ పెంపొం దించడంలో ఈ క్రీడ కీలక పాత్ర పోశిస్తుందని తెలి పారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జా తీయ స్థాయిల్లో రాణించి జిల్లాకు మ రింత గుర్తింపు తీసుకురావాలని ఆకాం క్షించారు. కార్యక్రమంలో పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకా రులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## సొంత తల్లికున్న ప్రేమ.. మారుతల్లికి ఉండదు

* **క్షమాపణతో రైతుల కష్టాలు తీరవు**
* **వంద పడకల ఆసుపత్రి సందర్శన**
* **మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కేటీఆర్ సహకారంతో మంజూరు చేయించుకున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణంపై తనకున్న శ్రద్ధ తల్లి ప్రేమ లాంటిదని.. మారుతల్లి ప్రేమలా ఆసుపత్రి నిర్మాణంపై ప్రస్తుత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి శ్రద్ధ ఉండదని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆరోపించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను ఆదివారం సందర్శించారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్ కు ఫోన్ ద్వారా తెలిపారు. అంతకుముందు మండలంలోని ఎల్లంబావి గ్రామ పంచాయతీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి 45రోజులు గడుస్తున్నా, 12కుప్పలు మాత్రమే కొనుగోలు చేశారని ఆరోపించారు. వర్షాకాలం ప్రారంభానికి ఐదారు రోజులు మాత్రమే ఉందని, ఇంకా 80కి పైగా కుప్పలు ఎప్పుడు కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు ఆలస్యం జరిగిందని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పారని కానీ, క్షమాపణతో రైతుల కష్టాలు తీరుతాయా అని ప్రశ్నించారు. వంద పడకల ఆసుపత్రి శంకుస్థాపన చేసి మూడున్నర సంవత్సరాలు గడుస్తున్నా, పనులు ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. నిర్మాణ పనులు ఎందుకు ఆలస్యం చేస్తున్నారని కాంట్రాక్టర్ ను అడగగా బిల్లులు రావడం లేదని చెబుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నానని నిధులు రాలేదని చెప్పిన ఎమ్మెల్యే, ప్రస్తుతం అధికారపక్షంలో ఉన్నా నిధులు ఎందుకు రావడం లేదని అభివృద్ధి ఎందుకు జరగడంలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్, దండు మల్కాపురం సర్పంచ్ గిర్కాటి నిరంజన్ గౌడ్, గడ్డం రాజారత్నం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అల్మాస్ పేట కిష్టయ్య, ఢిల్లీ మాధవరెడ్డి, తాడూరు పరమేష్, మెట్టు మహేశ్వర్ రెడ్డి, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, చిన్నం బాలరాజు, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, ముదిగొండ వెంకటేష్, రిక్కల బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక శాఖ తీరును ఖండించిన జిల్లా టీఎస్ యూటీఎఫ్

జనగామ, ప్రజాస్ఫూర్తి : ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అమలుకు సంబంధించిన విధివిధానాలు పూర్తిగా ఖరారు కాకముందే ఉద్యోగుల మే నెల వేతనాల నుంచి 1.5 శాతం చందా కోత విధించడం సరికాదని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా శాఖ తీవ్రం గా ఖండించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు పి.చంద్రశేఖర్ రావు, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేష్‌సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఆస్పత్రులతో ఒప్పందాలు, చికిత్స ప్యాకేజీ రేట్ల నిర్ణయం, డిజిటల్ హెల్త్ కార్డుల జారీ, చందా మినహాయింపుపై ప్రభుత్వ ఉత్తర్వులు వంటి కీలక అంశాలు ఇంకా పూర్తి కాలేదని వారు పేర్కొన్నారు. అయినప్పటికీ ఆర్థికశాఖ అత్యుత్సాహంతో ఉద్యోగుల వేతనాల్లో కోత విధించడం ఆందో ళన కలిగిస్తోందన్నారు. ఉద్యోగులు, పె న్షనర్ల కుటుంబసభ్యుల వివరాల నమో దులో ఇంకా స్పష్టత రాలేదని, ఐఎఫ్ఎం ఐఎస్ పోర్టల్ లో మార్పులు కొనసాగు తుండగానే కోతలు విధించడం సరైన విధానం కాదన్నారు. భార్యాభర్తలు ఇ ద్దరూ ఉద్యోగులైన సందర్భాల్లో చందా వసూళ్ల పై కూడా స్పష్టమైన మార్గదర్శ కాలు లేవని తెలిపారు. ఆరోగ్య పథకం అమలు పై ఉద్యోగుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసి,పారదర్శకంగా అమలు చేయాల్సిన సమయంలో ఏకపక్షంగా వేతనాల్లో కోతలు విధించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి వెంటనే జోక్యం చేసుకుని ఈహెచ్ఎస్ చందా పేరిట జరుగుతున్న వేతన కోతలను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఆర్థిక శాఖ తీసుకుం టున్న ఏక పక్ష నిర్ణయాలు ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితులు తీసుకురావచ్చ ని టీఎస్ యూటీఎఫ్ నాయకులు హె చ్చరించారు

## ప్రీ ప్రైమరీ పీ.ఎం శ్రీ విద్యను అంగన్వాడీలకే ఇవ్వాలి

: **సుంచు విజేందర్.**




జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రీ ప్రైమరీ పీఎం శ్రీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే కొనసాగించాలని, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు సుంచు విజేం దర్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా సీఐటీయూ కార్యాలయంలో జిల్లా ఉపా ధ్యక్షురాలు కొమ్ము మంగ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశం లో ఆయన మాట్లాడుతూ, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు ఏప్రిల్ నెల వేతనాలు ఇప్పటివరకు చెల్లించకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతు న్నాయని అన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయా లని ప్రభుత్వాన్ని కోరారు. ఖాళీ పోస్టుల భర్తీ, ఆధునిక స దుపాయాలతో కూడిన మొబైల్ ఫోన్ల పంపిణీతో పాటు ఐసీడీఎస్‌ను బలో పేతం చేయాలని, ప్రీప్రైమరీ విద్యను అంగన్వాడీలకే అప్పగించి ఉద్యోగ భద్ర త కల్పించాలని విజేందర్ ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బైరగోని అంజమ్, సహాయ కార్యదర్శు లు బి.బిక్షం, ఎ.సంతోష్, నల్ల నిర్మల, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తేనే ఓట్లు అడుగుతామని ప్రమాణం చేస్తారా?

* **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్**
* **రైతు డిస్కంతో అన్నదాతలకు ఉరితాడని వ్యాఖ్య**
* **ప్రైవేటీకరణ కుట్రలో భాగమని ధ్వజం**



సిద్దిపేట: 'రైతు డిస్కం ఏర్పాటు అనేది ఓ తుగ్లక్ చర్య. ప్రైవేటీకరణ కుట్రలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇదంతా చేస్తున్నారు. ఉత్తర డిస్కం, దక్షిణ డిస్కంలపై కొత్త అప్పులు తేవడానికి ఆడుతున్న నాటకం. కొత్త వ్యవస్థ అమలైతే రైతుల పాలిట ఉరితాడుగా, ప్రాజెక్టులకు శాపంగా మారనుంది. తాగునీటి ప్రాజెక్టులకు కరెంటు కొరత ఏర్పడుతుంది. రైతు డిస్కం నిర్ణయాన్ని విరమించుకోవాలి. రైతులకు అన్యాయం జరిగితే భారాస చూస్తూ ఊరుకోదు. అవసరమైతే మరో ఉద్యమం చేపడతాం' అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 'వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తేనే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతాం. లేదంటే అడగం' అని సీఎం ప్రమాణం చేయాలని సవాలు విసిరారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం భారాసకు సీఎం విసిరిన సవాలు.. తదితర అంశాలపై స్పందించారు. 'ప్రస్తుతం 13 గంటలకు మించి వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కావడం లేదు. రైతు డిస్కం ఏర్పాటుపై ఇచ్చిన జీవో నం.8లో సోలార్ విద్యుత్ గురించి ప్రస్తావించారు. సోలార్ కేవలం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకే ఉంటుంది. జీవో ఆధారంగా చూస్తే వ్యవసాయానికి 8, 9 గంటలు మించి కరెంటు రాదు. పక్కాగా వచ్చే థర్మల్ పవర్‌ను గృహాలు, కంపెనీలు.. ఇలా బిల్లులు చెల్లించే వాటికి కేటాయిస్తాం.. రైతులకు మాత్రం గ్యారంటీ లేని సోలార్ విద్యుత్ ఇస్తామనడం సబబేనా? రైతు డిస్కంతో 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా అనేది పచ్చి అబద్ధం. గుజరాత్‌లో 7 గంటలు, కర్ణాటకలో 8 గంటలు మాత్రమే ఇస్తున్నారు. తెలంగాణలో కూడా అదే జరగబోతోంది.

**నీళ్లు ఆంధ్రకు తరలిపోతాయి...**

ఎత్తిపోతల పథకాలైన కాళేశ్వరం, దేవాదుల, సీతమ్మసాగర్, సమ్మక్కసాగర్, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిలసాగర్ తదితర ప్రాజెక్టులు ప్రమాదంలో పడతాయి. కృష్ణ, గోదావరి వరద నీటిని తక్కువ సమయంలో ఒడిసిపట్టి రిజర్వాయర్లు నింపాలంటే నిరంతరాయంగా మోటార్లు నడవాలి. సౌర విద్యుత్‌తో ఎలా సాధ్యమవుతుంది? దీంతో ప్రాజెక్టుల కింద పంటలు పండవు. నీళ్లు ఆంధ్రకు తరలిపోతాయి. మిషన్ భగీరథ, ఇతర తాగునీటి పథకాలకు కరెంటు కోతలు తప్పవు. హైదరాబాద్ సహా ఏ జిల్లాకు నీళ్లు రావాలన్నా 20 గంటలు కరెంటు ఉండాల్సిందే.

# తెలంగాణలో డిగ్రీ, పీజీ కాలేజీలకు వేసవి సెలవులు పొడిగింపు... ఎప్పటివరకు అంటే...!

- **తీవ్ర వడగాడ్పుల కారణంగా వేసవి సెలవులు పొడిగింపు**
- **జూన్ 1కి బదులుగా 6, 8 తేదీల్లో తరగతులు ప్రారంభం**
- **ఉస్మానియా, కాకతీయ సహా పలు వర్సిటీల పరిధిలో ఈ నిర్ణయం అమలు**
- **విద్యార్థులు, అధ్యాపకులకు ఊరటనిచ్చిన యూనివర్సిటీల ప్రకటన**
- **పరిపాలన సిబ్బంది మాత్రం యధావిధిగా విధులకు హాజరు కావాలని ఆదేశాలు**

రాష్ట్రంలో తీవ్రమైన వడగాలుపుల కారణంగా తెలంగాణలోని యూనివర్సిటీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. డిగ్రీ, పీజీ కాలేజీలకు వేసవి సెలవులను జూన్ 6వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించాయి. వాస్తవానికి జూన్ 1న కాలేజీలు పునఃప్రారంభం కావాల్సి ఉండగా, తాజా నిర్ణయంతో జూన్ 6 నుంచి 8వ తేదీ మధ్య తరగతులు మొదలవుతాయి. ఉస్మానియా, పాలమూరు, తెలంగాణ, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీల పరిధిలోని క్యాంపస్, అనుబంధ కాలేజీలకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. ఉస్మానియా, పాలమూరు, తెలంగాణ వర్సిటీలు సెలవులను జూన్ 6 వరకు పొడిగించగా, జూన్ 7 ఆదివారం కావడంతో జూన్ 8న కాలేజీలు తెరుచుకుంటాయి. మరోవైపు, కాకతీయ, శాతవాహన వర్సిటీలు జూన్ 5 వరకు సెలవులు ప్రకటించి, జూన్ 6న తరగతులు ప్రారంభించనున్నాయి. రాష్ట్రంలో కొనసాగుతున్న తీవ్రమైన వేసవి పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతల కారణంగానే ఈ నిర్ణయం





తీసుకున్నట్లు యూనివర్సిటీలు తమ సర్క్యులర్లలో పేర్కొన్నాయి. అయితే, ఈ సెలవులు విద్యార్థులు, టీచింగ్ సిబ్బందికి మాత్రమే వర్తిస్తాయి. ప్రిన్సిపాల్స్, పరిపాలన బాధ్యతల్లో ఉన్న సిబ్బంది యధావిధిగా విధులకు హాజరు కావాలని స్పష్టం చేశాయి. ఇప్పటికే రాష్ట్రంలో పాఠశాలలకు ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు పొడిగించిన విషయం తెలిసిందే. అధ్యాపక సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ పొడిగింపు నిర్ణయం తీసుకున్నట్లు తెలంగాణ గవర్నమెంట్ కాలేజెస్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ తెలిపింది. వాతావరణ శాఖ పలు జిల్లాలకు వడగాలుపుల హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో, ఈ అదనపు సెలవులు విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిస్తున్నాయి.

## నేటి నుంచి 'కనీస వేతనాలు'

* **మూడు జోన్లు, నాలుగు నైపుణ్య కేటగిరీలుగా విభజన**
* **77కు చేరిన ఉపాధి రంగాల సంఖ్య**



హైదరాబాద్: రాష్ట్రంలో పనిచేస్తున్న 1.11 కోట్ల మంది కార్మికులు, వేతన జీవులకు కనీస వేతనాలు సోమవారం నుంచి పెరగనున్నాయి. ఈ మేరకు కార్మికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కనీస వేతనాల పరిధిలోకి కొత్తగా పది రంగాలను చేర్చడంతో మొత్తం ఉపాధి రంగాల సంఖ్య 77కు చేరింది. వేర్వేరు షెడ్యూల్డు రంగాలకు, వేర్వేరు వేతనాలు కాకుండా అందరికీ ఒకేవిధమైన వేతనాల కోసం తెలంగాణ ప్రభుత్వం ఏకీకృత నమూనా ప్రవేశ పెట్టింది. ఈ కొత్త ఉత్తర్వులతో కార్మికులకు భారీగా ప్రయోజనం చేకూరనుంది.

**మూడు జోన్లు**

గ్రామాలు, మున్సిపాలిటీలు, నగర పాలికల వారీగా మూడు జోన్లుగా విభజించి, ఆయా జోన్లలో నైపుణ్య కేటగిరీల వారీగా కనీస వేతనాలను కార్మికశాఖ ఖరారు చేసింది. నగరపాలికలను జోన్ 1, మున్సిపాలిటీలను జోన్ 2గా, గ్రామాలు, ఇతర ప్రాంతాలు జోన్ 3గా ప్రకటించింది. కొత్తగా హైస్కిల్డ్ కేటగిరీని చేర్చి.. జోన్ 1లో కనీస వేతనం రూ.20వేలుగా నిర్ణయించింది.

**14 ఏళ్ల తర్వాత..**

ఇతర రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణలో కార్మికుల కనీస వేతనాలు తక్కువగా ఉన్నాయని, వీటిని సవరించాలని పలుమార్లు కార్మిక సంఘాలు, వర్కర్ల అసోసియేషన్లు 2022లో హైకోర్టును ఆశ్రయించాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డిప్యూటీ సీఎం నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది.

## ఉద్యమ స్ఫూర్తి, జర్నలిస్టుల సంక్షేమ టీజేఎఫ్ మహాప్రస్థానం

* **టియూడబ్లూజే జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్ గౌడ్ ..**

ప్రజా స్ఫూర్తి , నల్గొండ : తెలంగాణ రాష్ట్ర ఉద్యమ చరిత్రలో ఎన్నో సంస్థలు, ఎన్నో వేదికలు ఏర్పడ్డప్పటికీ ఉద్యమ ఆవశ్యకత నుంచి పుట్టి, రాష్ట్ర సాధన తర్వాత కూడా సమాజానికి, ముఖ్యంగా జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం అండగా నిలిచిన అరుదైన వేదికల్లో తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎఫ్) ఒకటని, "తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టు" అనే నినాదంతో గుప్పెడు మంది జర్నలిస్టులతో ప్రారంభమైన ఈ వేదిక, తర్వాత తెలంగాణ ఉద్యమానికి మేధో శక్తిగా, ఆత్మగౌరవ స్వరంగా, కలం యోధుల సంఘటిత శక్తిగా ఎదిగిందని టియుడబ్ల్యూజే నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం 25 వసంతాల సందర్భంగా టియుడబ్ల్యూజే జిల్లా శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ పెద్ద గడియారం సెంటర్ లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించడంతో పాటు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించడం జరిగింది. ఈ ఉద్యమానికి ప్రధాన సారథిగా నిలిచిన వ్యక్తి అల్లం నారాయణ నాయకత్వంలో టీజేఎఫ్ కేవలం జర్నలిస్టు సంఘం కాకుండా తెలంగాణ ఉద్యమంలో కీలక మేధో వేదికగా




రూపుదిద్దుకుందన్నారు. తెలంగాణ కోసం రాసిన ప్రతి అక్షరం వెనుక ఒక ఆవేదన ఉందని, ప్రతి నిరసన వెనుక ఒక ఆత్మగౌరవం ఉందని, ఆ రెండింటినీ కలిపి ఉద్యమ శక్తిగా మార్చిన అరుదైన జర్నలిస్టుల వేదికే తెలంగాణ జర్నలిస్టు ఫోరం అని పేర్కొన్నారు. ఉద్యమ వేదిక నుంచి హక్కుల వేదికగా మారిన ఈ పరిణామం తెలంగాణ జర్నలిస్టు చరిత్రలో ఒక కీలక అధ్యాయమని చెప్పారు. గుప్పెడు మంది కలం యోధులు ప్రారంభించిన ఉద్యమం, నేడు వేలాది జర్నలిస్టులకు స్ఫూర్తి అని , తెలంగాణ రాష్ట్రసాధనలో కలంతో పోరాడిన ఆతరం జర్నలిస్టుల సేవలను గుర్తుచేసుకునే రోజని, తెలంగాణ కోసం వార్త రాసిన ప్రతి కలం వెనుక ఒక ఉద్యమ గుండె చప్పుడు ఉందని, ఆ చప్పుడికి రూపం ఇచ్చిన వేదికే తెలంగాణ జర్నలిస్టు ఫోరం అని కొనియాడారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు విజయ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులపై ఎక్కడ దాడులు జరిగినా, ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించే శక్తిగా ఈ సంఘం ఎదిగిందని, గ్రామీణ విలేకరుల నుంచి పెద్ద మీడియా సంస్థల జర్నలిస్టుల వరకు అందరికీ ఒక అండగా నిలబడే ప్రయత్నం చేసింది.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అల్లం నారాయణ తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా సుదీర్ఘ కాలం పనిచేశారని దాదాపు పదేళ్లపాటు ఆ బాధ్యతల్లో కొనసాగుతూ తెలంగాణ జర్నలిజం అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ ఫండ్ ద్వారా మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం అందించడం, వారి పిల్లల విద్యకు సహాయం చేయడం, అనారోగ్య సమస్యల్లో అండగా నిలవడం వంటి కార్యక్రమాలు అమలులోకి వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి వీరస్వామి, జిల్లా నాయకులు ఫహిమొద్దీన్, జనార్ధన్ రెడ్డి, దీకొండ రవిశంకర్, పిల్లలమర్రి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటరెడ్డి, జానయ్య, నల్లగొండ డివిజన్ యూనియన్ నాయకులు నీలం వెంకట మధు, దండంపల్లి రవికుమార్ గౌడ్, మధు, వీడియో జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అల్లి మల్లికార్జున్, శ్రీనివాస్ గౌడ్, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కంది వేణు, ముచ్చర్ల విజయ్, ముచ్చర్ల శ్రీనివాస్ గౌడ్, చిన్న పత్రికల సంఘం తరపున మీసాల నరహరి, నవీన్, మధు, సైదులు, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పాటతో మొదలైన నా ప్రయాణం..

## సక్సెస్ స్టోరీ మానసి పరేఖ్



సింగింగ్‌తో మొదలైన ఆమె కెరీర్.. యాక్టింగ్‌తో కొత్త మలుపు తీసుకుంది. ఇప్పుడు రెండింటిలోనూ సక్సెస్‌ఫుల్‌గా దూసుకెళ్తోంది. లేటెస్ట్‌గా 'జమ్‌కుడి' అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకొచ్చింది. ఈ సినిమా కోసం ఆమె టైటిల్ ట్రాక్ కూడా పాడింది. ఇంతకీ ఆమె ఎవరంటే... గుజరాతీ యాక్ట్రెస్ మానసి పరేఖ్. "ఇంతకుముందు కూడా నా సినిమాలకు నేను పాడా. 'కచ్ ఎక్స్‌ప్రెస్'లో 'కంగ్రాచ్యులేషన్స్' అనే పాట. నేను నటించిన సినిమాలో పాట కూడా పాడడం చాలా హ్యాపీగా అనిపిస్తుంది" అంటోంది మానసి పరేఖ్. ఆమె సక్సెస్‌ఫుల్ జర్నీ గురించి మరిన్ని ముచ్చట్లు తెలుసుకుందాం.

నేను పుట్టింది గుజరాత్‌లో. పెరిగింది ముంబైలో. కాబట్టి రెండింటితో నాకు చాలా కనెక్షన్ ఉంటుంది. చిన్నప్పటి నుంచే మ్యూజిక్ అంటే ప్యాషన్. దాంతో అప్పుడే పాటలు పాడడంలో శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టా. స్కూల్ ఈవెంట్స్, రియాలిటీ షోలు వంటి వాటిల్లో యాక్టివ్‌గా పార్టిసిపేట్ చేశా. దాంతో మంచి పేరొచ్చింది. ఒకసారి ఒక షోకి సెలక్ట్ అయితే, అక్కడి నుంచి మరో అవకాశం దక్కేది. అలా వరుసగా ఎనిమిది టీవీ షోల్లో పార్టిసిపేట్ చేశా. వాటితోపాటు అడ్వర్టైజ్‌మెంట్స్‌లో కూడా కనిపించేదాన్ని. ఒకసారి ఫేమ్ వచ్చిందంటే.. వాళ్లు ఒక రంగంలోనే కాదు. వివిధ రంగాల్లో తమ టాలెంట్ ప్రూవ్ చేసుకునే అవకాశం కూడా వస్తుంది. నా విషయంలోనూ అదే జరిగింది. హిందీ, గుజరాతీ సినిమాలు, షార్ట్ ఫిల్మ్స్ ద్వారా నటనలోకి అడుగుపెట్టా. నాకు నటనలో నా స్కిల్స్ పెంచుకోవడానికి టీవీ షోలు ఉపయోగపడ్డాయి. అది కాకుండా నేను న్యూయార్క్‌లోని 'లీ స్ట్రాస్‌బర్గ్ థియేటర్ అండ్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్'లో

### 20 ఏండ్ల అనుబంధం

టెలివిజన్ ఇండస్ట్రీతో నాకు 20 ఏండ్ల అనుబంధం ఉంది. అక్కడ ఎన్నో విలువైన పాఠాలు నేర్చుకున్నా. టీవీలో పనిచేసేవాళ్లు ఎలాంటి పరిస్థితుల్లోనైనా తమ పని పూర్తి చేయాల్సి ఉంటుంది. వాళ్ల ఎమోషన్స్ అన్నీ పక్కన పెట్టి నటించాలి. అదెలా ఉంటుందంటే.. మిలిటరీ ట్రైనింగ్‌లా ఉంటుంది అనిపించింది నాకు. ఎన్ని పనులున్నా, ఎలాంటి సమస్యలున్నా ప్రతి రోజూ షూటింగ్‌కి వెళ్లాల్సిందే. ఎలాంటి సిచ్యుయేషన్‌లో అయినా స్థిరంగా ఉండడం టెలివిజన్ నాకు నేర్పించింది. నాకున్న స్కిల్స్‌ను నేను రకరకాలుగా ఉపయోగించుకున్నా. టీవీలో నేను చాలా సవాళ్లు ఎదుర్కొన్నా. నేను 'గులాల్' అనే పాపులర్ షో చేశాను. ఆ షో సెట్ మా ఇంటికి గంటన్నర జర్నీ దూరంలో ఉంటుంది. అంటే, నేను అక్కడికి వెళ్లిరావడానికి జర్నీకి మూడు గంటలు టైం పట్టేది. సెట్లో 14 గంటలు ఉండాల్సి వచ్చేది. మొత్తంగా ప్రతిరోజు నేను 17 గంటలు కష్టపడేదాన్ని. ఏడు గంటలు మాత్రమే నిద్రపోయేదాన్ని. అలా ఒక సంవత్సరం పాటు చేశాను. అయితే, ఆరునెలలు గడిచాక ఒత్తిడి వల్ల హెల్త్ పాడయ్యింది. డాక్టర్ దగ్గరకి వెళ్తే నా ప్రొఫెషన్ గురించి అడిగారు. ఎందుకంటే అప్పటికీ నా కళ్ల చుట్టూ డార్క్ సర్కిల్స్ ఉన్నాయి. కాళ్లు వాచిపోయాయి. చెప్పాలంటే నా ప్రొఫెషన్‌కి నేను ఇలా ఉంటే పనిచేయలేను. అలాంటి సిచ్యుయేషన్‌ని దాటుకుని ఇక్కడి వరకు వచ్చా.

### కూతురుకి అంతే ఇంపార్టెన్స్ ఇస్తా

వర్క్‌ని, పర్సనల్ లైఫ్‌ని బ్యాలెన్స్ చేయడం చాలా కష్టం అనుకునేదాన్ని. ఇప్పుడు నా ప్రియారిటీలు ఏంటీ? అనేది నాకు తెలుసు కాబట్టి ఆ విధంగా మెయింటెయిన్ చేస్తున్నా. నా వర్క్‌కి ఎంత ఇంపార్టెన్స్ ఇస్తానో, నా కూతురుకి అంతే ఇంపార్టెన్స్ ఇస్తా. అమ్మ అంటే ఇంట్లో కూర్చుని పిల్లల్ని మాత్రమే చూసుకోవాల్సిన పనిలేదు. నేను సినిమాల్లోకి వచ్చి ఏడున్న ఏండ్లు అవుతుంది. నా కూతురు పుట్టాక, నేను ఏడు సినిమాల్లో నటించా. అంటే, ఏడాదికొక సినిమా చేశా అనుకోవచ్చు. అలా నేను వర్క్, ఫ్యామిలీ రెండింటినీ సమానంగా చూస్తా.

### 'జమ్‌కుడి'.. మర్చిపోలేని సక్సెస్

జమ్‌కుడి సినిమాలో నాది లీడ్ రోల్. అయితే మ్యూజిక్ డైరెక్టర్ ఒక పాట నువ్వు పాడాలని చెప్పారు. పాట అంటే నాకు ఎప్పుడూ ఇష్టమే కాబట్టి ఒప్పుకున్నా. సినిమాలో నటించడం, పాడడం వల్ల నేను క్యారెక్టర్‌కి బాగా కనెక్ట్ అయ్యా. పాటకు ఆడియెన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చూస్తే చాలా హ్యాపీగా అనిపిస్తుంది. గ్లోబల్‌గా వైరల్ అవ్వడం మరింత ఉత్సాహాన్నిస్తోంది. ఇవన్నీ చేయగలుగుతున్నా కాబట్టి నా జర్నీ సంతృప్తికరంగా ఉంది. ఈ సినిమాని మా ఆయన పార్థివ్ గోహిల్ ప్రొడ్యూస్ చేశారు. తను నాలాగే యాక్టర్, సింగర్ కూడా. ఈ సినిమా కథ వినప్పుడే నా క్యారెక్టర్ డిసైడ్ చేశారు. ఆ సినిమా హిట్ అవుతుంది అనుకున్నాం. కానీ గుజరాతీ సినిమాల్లో ఈ ఏడాది బెస్ట్‌గా నిలుస్తుంది అనుకోలేదు. పది రోజుల్లో 8.5 కోట్లు కలెక్ట్ చేసింది. గుజరాతీ సినిమా గొప్పదనం ఏంటో నిరూపించింది అని గర్వంగా చెప్తా.

**బ్యూటీ**

## ముఖ సౌందర్యం కోసం..





### కీరా – అలోవెరాతో..

ఒక టేబుల్ స్పూన్ అలోవెరా జెల్‌లో పావు టీస్పూన్ కీరదోస తురుము వేసి బాగా కలపాలి. ఆ ప్యాక్‌ని ముఖం, మెడ భాగాలకు పూసుకోవాలి. పావుగంట తర్వాత గోరువెచ్చని నీటితో ముఖం కడుక్కుంటే కాంతివంతంగా ఉంటుంది.



### పాలు–తేనెలతో..

ఒక టీస్పూన్ తేనెలో రెండు టీస్పూన్లు పచ్చి పాలు కలపాలి. ఆ రెండూ బాగా మిక్స్ అయ్యేలా కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి రెండు లేదా మూడు నిమిషాలు మర్దన చేయాలి. ఆ తర్వాత గోరు వెచ్చని నీళ్లతో ముఖాన్ని కడగాలి. పాలు, తేనెల ఫేస్‌వాష్ వాడితే స్కిన్ కాంతివంతంగా మారుతుంది. జిడ్డు తొలగిపోతుంది. సెన్సిటివ్ స్కిన్ ఉన్న వాళ్లకు ఇది చాలా బాగా పనిచేస్తుంది.

# మార్కులు సేమ్.. ఒకే ర్యాంకు ఎందుకివ్వరు? సీఎంను ప్రశ్నించిన బాలిక

బోర్డు పరీక్షల్లో సమాన మార్కులు వచ్చినప్పుడు.. వయసు ఆధారంగా ర్యాంకులను కేటాయించడంపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ (Bhagwant Mann)ను ఓ విద్యార్థిని ప్రశ్నించింది. ప్రభుత్వ విధానం సరిగా లేదని అభిప్రాయపడింది. ఇందుకు బదులిచ్చిన సీఎం.. వెంటనే ఆయా విద్యార్థులకు మొదటి స్థానం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. పంజాబ్ స్టేట్ బోర్డులో 8, 10, 12వ తరగతుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించేందుకు 'సితారే జమీన్ తే' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా విద్యార్థులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహించారు. ఈ క్రమంలో అమృత్‌సర్‌కు చెందిన ఓ విద్యార్థిని లేచి నిలబడి.. "మేమందరం ఒకే తరగతిలో చదువుకుంటాం. అందరం కష్టపడతాం. టీచర్లు కూడా అంతే కృషి చేస్తారు. కానీ, వయసు ఆధారంగా మొదటి, రెండు, మూడు స్థానాలు ఎందుకు ప్రకటిస్తారు? అని ఆ బాలిక ప్రశ్నించడంతో సభాప్రాంగణం చప్పట్లతో మారుమోగింది. ఇందుకు సీఎం స్పందిస్తూ.. మా దృష్టిలో మీ ముగ్గురిది తొలి స్థానమేనని బదులిచ్చారు. అంతేకాదు.. సమాన మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు సంయుక్తంగా తొలి ర్యాంకు




ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. వయసు ఆధారంగా కాకుండా మార్కుల ఆధారంగానే స్థానాలు కేటాయించాలని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులందరితో కలిసి సీఎం ఫొటో తీసుకున్నారు. అదే వేదికపై ఉన్న దిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా మాట్లాడుతూ.. 'మీ విధానం తప్పు' అని ముఖ్యమంత్రికి ఓ విద్యార్థిని చెప్పడాన్ని చూసి సంతోషిస్తున్నానని అన్నారు. ఇదిలాఉంటే, పంజాబ్ ప్రభుత్వ విద్యా విధానం ప్రకారం.. బోర్డు పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు సమానంగా మార్కులు సాధిస్తే.. వారిలో అతి చిన్న వయసు గల విద్యార్థికి మొదటి ర్యాంకు కేటాయిస్తారు.



## నోట్ల వర్షం కురిపించిన వానరం!

బులంద్‌షహర్: కోర్టు పనిమీద వచ్చిన ఓ వ్యక్తికి కోతి చుక్కలు చూపించింది. నగదుతో ఉన్న బ్యాగును ఎత్తుకెళ్లి.. చెట్టుమీద నుంచి నోట్ల వర్షం కురిపించింది. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని బులందర్‌షహర్‌లో శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. జిల్లా కేంద్రంలోని కోర్టుకు వచ్చిన రవీంద్ర, ఆయన సహచరుడు ఆమిర్ స్టాంప్ పేపర్లు కొందామని వెళుతుండగా హఠాత్తుగా వచ్చిన వానరం.. బ్యాగును అపహరించుకుపోయింది. రూ.2 లక్షల నగదు ఉన్న బ్యాగుతో అక్కడే ఉన్న ఓ చెట్టెక్కి కూర్చుంది. బ్యాగు మొత్తం చింపేయడంతో నోట్ల వర్షం కురిసింది. దీంతో స్థానికులు చెట్టుకింద పడిన నోట్లను సేకరించి తిరిగి రవీంద్రకు అప్పగించారు. ఆర్థికంగా ఎలాంటి నష్టం జరగలేదని స్థానికులు తెలిపారు. కోతి చేసిన హడావుడి కారణంగా కాసేపు కోర్టు ప్రాంగణం కోలాహలం నెలకొంది.

# ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ విమర్శలు

దిల్లీ: సీబీఎస్‌ఈ ఆన్‌స్క్రీన్ మార్కింగ్ వివాదంపై రాహుల్ గాంధీ మరోసారి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'మన్‌కీ బాత్'లో మామిడి పండ్ల గురించి మాట్లాడ్డానికి ప్రధాని మోదీకి సమయం ఉంటుంది గానీ, 18.5 లక్షల మంది విద్యార్థుల భవితవ్యం గురించి మాట్లాడేందుకు తీరిక లేదంటూ విమర్శించారు. సీబీఎస్‌ఈ ఆన్ స్క్రీన్ మార్కింగ్ సమస్య కేవలం నిర్లక్ష్యం కాదని.. అదో కుమ్మక్కు అంటూ రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఉదయం 'మన్‌కీబాత్'లో ప్రధాని మోదీ మామిడి పండ్ల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. మామిడి పండ్ల గురించి చర్చలేని ఇల్లు ఉండదని పేర్కొన్నారు. ఒక్కో ప్రాంతానికి ఒక్కో రకం మామిడి పండు ఉంటుందని, దానికంటూ రుచి వేరేగా ఉంటుందన్నారు. మహారాష్ట్ర అల్ఫోన్సో, గుజరాత్ కేసర్, తెలుగు రాష్ట్రాల్లో బంగినపల్లి, తోతాపురి, నీలం, సువర్ణ రేఖ వంటి రకాలు లభిస్తాయని చెప్పారు. భారత్‌లో గ్రామీణ ప్రాంతాల్లో పండే మామిడి పండ్లకు ప్రపంచస్థాయి మార్కెట్



ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సీబీఎస్‌ఈ మూల్యంకనం గురించి ప్రశ్నలు లేవనెత్తిన విద్యార్థులతో ముచ్చటించిన వీడియోను తన సోషల్‌మీడియా ఖాతాలో పంచుకున్నారు. మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ధైర్యవంతులు అని కొనియాడారు. అయితే, వారికి సమాధానాలకు బదులు అవమానాలు ఎదురయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. సీబీఎస్‌ఈ టెండర్ నిబంధనలను మార్చేసిన ఫలితమే ఇదీ అని రాహుల్ గాంధీ తన ఎక్స్‌లో పేర్కొన్నారు. వాస్తవానికి 300 డీపీఐతో ఆటోమేటిక్ రోబోటిక్ స్కానర్లను పరీక్ష పత్రాల స్కానింగ్‌కు వినియోగించాల్సి ఉండగా.. తర్వాత నిబంధనలను సవరించారని పేర్కొన్నారు. దీంతో సంబంధిత టెండర్ దక్కించుకున్న కోఎంఫ్ట్ సంస్థ ఆన్సర్ షీట్లను మొబైల్ ఫోన్ సాయంతో స్కాన్ చేసి తప్పిదాలకు పాల్పడిందని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థులు బాధితులుగా మారారని తెలిపారు. దీనిపై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండగా.. ప్రధాని మోదీ 'మన్‌కీ బాత్'లో ఒక్క మాటా మాట్లాడలేదని విమర్శలు గుప్పించారు.


## OnMark పోర్టల్..
## లోపాలు పరిశీలిస్తున్నాం : సీబీఎస్‌ఈ




ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (OSM) మూల్యాంకన ప్రక్రియపై వివాదం నేపథ్యంలో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (CBSE) ఎట్టకేలకు మౌనం వీడింది. ఈ పోర్టల్‌లో వెలుగు చూస్తున్న లోపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని పేర్కొంది. ఈ వ్యవస్థను పటిష్ఠం చేయడానికి సైబర్ సెక్యూరిటీ నిపుణుల బృందం కొన్ని రోజులుగా పనిచేస్తోందని, ఇప్పటివరకు గుర్తించిన సమస్యలను సరిచేసిందని తెలిపింది. "ఆన్‌మార్క్ పోర్టల్‌లో వెలుగు చూస్తోన్న లోపాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. ఈ వ్యవస్థలను పటిష్ఠం చేయడానికి గత కొన్ని రోజులుగా ఐఐటీలు, వివిధ ప్రభుత్వ విభాగాలతో కూడిన సైబర్ సెక్యూరిటీ నిపుణులు ప్రయత్నిస్తున్నారు. వ్యవస్థను మరింత సురక్షితంగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే గుర్తించిన లోపాలను సరిచేశారు. ఇంకా ఏమైనా లోపాలు ఉన్నాయా? అనేది పరిశీలిస్తూ కట్టడి చేసే పనిలో ఉన్నారు. ఈ వ్యవహారంలో అప్రమత్తంగా ఉంటూ లోపాలను ఎత్తిచూపుతున్న పౌరులు, ఎథికల్ హ్యాకర్లందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. వారిలో కొందరిని సంప్రదించాం. మరేదైనా సమాచారం ఉంటే సైబర్ భద్రతా విభాగాన్ని సంప్రదించవచ్చు" అని ఎక్స్ వేదికగా సీబీఎస్‌ఈ సూచించింది.

## ఉగ్రవాదులకు సాయంగా భారత్‌లోకి
# అక్రమంగా టెలికామ్ సంకేతాలు : పాక్ దుశ్చర్య

ఉగ్రవాద పోషణలో పాక్ వంకర బుద్ధి మారడంలేదు. జమ్మూ కశ్మీర్‌లోని ఉగ్ర నెట్‌వర్క్‌ల కోసం అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ నిబంధనల ఉల్లంఘనలకు కూడా పాల్పడుతోంది. ఇందుకోసం సరిహద్దుల వెంట భారత్ వైపు అక్రమంగా సెల్యూలర్ సంకేతాలను పంపిస్తోంది. ఇది ఉగ్రవాదుల రహస్య కమ్యూనికేషన్లకూ ఊపిరిగా ఉపయోగపడుతోందని అధికారులు వెల్లడించారు. ఇటీవల పాకిస్థాన్ చర్యలు అధికారుల అనుమానాలను మరింత బలపరుస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణ పీర్ పంజాల్ పర్వతశ్రేణుల్లో చొరబాట్లు పెరుగుతున్నాయి. దీనికి తోడు నియంత్రణ రేఖకు అటువైపు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఏర్పాటు చేసిన సెల్ టవర్ల సంకేతాలు కరుడు గట్టిన ఉగ్రవాదులున్న జైళ్లకు చేరుతున్నాయి. కశ్మీర్‌లోని పర్వతశ్రేణులు సహజంగా చాలా వరకు సంకేతాలను అడ్డుకొంటున్నా.. మైదాన ప్రాంతం ఉన్న జమ్మూలో మాత్రం ఈ సంకేతాలు భారత్‌లోకి చొరబడి ఉగ్రనెట్‌వర్క్‌లకు చేరుతున్నాయి. ముఖ్యంగా కతువా, రాజౌరీ, పూంచ్ జిల్లాలు, జమ్మూలోని కోట్ బల్వాల్ జైలు వంటి ప్రదేశాల వద్ద పాక్ టెలికామ్ సిగ్నల్స్‌ను మన దళాలు గుర్తించాయి. కొన్ని జైళ్లలో ఇప్పటికే జామర్లను ఏర్పాటు చేసినా వీటిని అడ్డుకోవడంలో విఫలం అవుతున్నాయి. అక్రమంగా కారాగారాల్లోకి చేరిన ఫోన్లను



ఖైదీలు వినియోగిస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లో మొత్తం 14 జైళ్లు, రెండు కరెక్షన్ హోమ్‌లు ఉన్నాయి. పాకిస్థాన్ టవర్లు చైనాకు చెందిన సీడీఎంఏ టెక్నాలజీని వినియోగిస్తున్నాయి. వీటిల్లో అత్యున్నత స్థాయి ఎన్‌క్రిప్షన్ సాధ్యమవుతుంది. ఇది ఉగ్రవాదులు వాడే వైఎస్‌ఎంఎస్‌కు ఉపయోగపడుతుంది. సీడీఎంఏ పలు సిగ్నల్స్‌ను ఏకకాలంలో అనుమతిస్తుంది. దీంతో భద్రతా ఏజెన్సీల ఎలక్ట్రానిక్ మానిటరింగ్ సమస్యాత్మకంగా మారుతుంది. దీంతో ఉగ్రవాదులు వైఎస్‌ఎంఎస్ టెక్నాలజీని విరివిగా వాడుతున్నారు. దీంతో పాక్ పంపే సిగ్నల్స్‌తో పీవోకేలోని హ్యాండ్లర్లు, చొరబాటుదారులు, వారికి ఆశ్రయం ఇచ్చే వారితో నిరంతరం టచ్‌లో ఉంటున్నారు. ఈ అక్రమ విధానాలతో పాకిస్థాన్ ఐరాస అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ రాజ్యాంగంలోని 45 ఆర్టికల్‌ను ఉల్లంఘిస్తోందని అధికారులు వెల్లడించారు. ఈ ఆర్టికల్ ప్రకారం ఒప్పందంపై సంతకాలు చేసిన మొత్తం 193 దేశాలు తమ భూభాగం నుంచి అధిక, రోగ్, తప్పుడు, తప్పుదోవ పట్టించే సంకేతాలు పక్కదేశాల్లోకి వెళ్లకుండా సహకరించుకోవాలి.

## భాజపాటీఎంసీ కార్యకర్తల మధ్య ఘర్షణ: ఎంపీ కల్యాణ్ బెనర్జీకి గాయం..!

పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన మరో ఎంపీపై ఆదివారం ఉదయం దాడి జరిగింది. హుగ్లీ జిల్లా చెండితాల పోలీస్ స్టేషన్ బయట జరిగిన టీఎంసీ భాజపా కార్యకర్తల మధ్య ఘర్షణలో ఎంపీ కల్యాణ్ బెనర్జీపై దాడి చేశారు. ఆయన పోలీస్ స్టేషన్ దిశగా కార్యకర్తలతో కలిసి నడుచుకొంటూ వెళుతుండగా.. కేంద్ర బలగాలు ఆయన్ను ఆపి ప్రశ్నిస్తుండగా.. వెనక నుంచి వచ్చిన రాయి తలకు తగిలి హఠాత్తుగా నేలపై పడిపోయారు. ఇటీవల అరెస్టైన తమ పార్టీ నేతలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం సమర్పించేందుకు కార్యకర్తలు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొన్నారు. అదే సమయానికి అక్కడికి భాజపా కార్యకర్తలు కూడా వచ్చి నినాదాలు చేశారు. దీంతో ఇరు



వర్గాల మధ్య ఘర్షణ మొదలైంది. దీంతో భారీ సంఖ్యలో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలను అక్కడకు తరలించారు. తాను పోలీస్ స్టేషన్‌కు వెళుతుండగా దాడి జరిగినట్లు ఎంపీ కల్యాణ్ బెనర్జీ వెల్లడించారు. వినతిపత్రం ఇచ్చేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన తమ కార్యకర్తలపై అకారణంగా దాడి చేశారని ఆయన చెప్పారు.

# టీఎంసీ అంతర్గత కుమ్ములాటలే అభిషేక్ బెనర్జీపై దాడికి కారణం


తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై దాడికి వారి పార్టీలోని అంతర్గత కుమ్ములాటలే కారణమని భాజపా పేర్కొంది. ఈ మేరకు భాజపా నేత ప్రదీప్ భండారీ పలు ఆరోపణలు చేస్తూ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. "అభిషేక్ బెనర్జీపై దాడికి టీఎంసీ అంతర్గత వర్గాలే కారణమా..? అరెస్ట్ అయిన ఆరుగురు నిందితులు మాజీ ఎమ్మెల్యే లవ్లీ మొయిత్రాకు సన్నిహిత సహాయకులే. టీఎంసీ శ్రేణులే అభిషేక్‌కు వ్యతిరేకమయ్యాయా?



భాయ్‌పో (బెంగాల్‌లో మేనల్లుడు)

పై ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో ఊహించుకోండి" అని పేర్కొన్నారు. మరోవైపు పశ్చిమబెంగాల్ మంత్రి అగ్నిమిత్ర పౌల్ కూడా టీఎంసీ ఆరోపణలను తోసిపుచ్చారు. టీఎంసీపై ఉన్న ప్రజాగ్రహానికి ఈ ఘటన అద్దంపడుతోందన్నారు. "ఈ రోజుల్లో మనం నిజమైన ప్రజాగ్రహం చూస్తున్నాం. కొన్నేళ్లుగా మమతా, అభిషేక్, టీఎంసీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడ్డారు. ఇప్పుడు కూడా వారు అటువంటి వాటికి యత్నిస్తే మాత్రం చూస్తూ ఊరుకోము" అని హెచ్చరించారు. హంతకులు ఎవరో ప్రజలు చెబుతున్నారని అగ్నిమిత్ర పౌల్ వ్యాఖ్యానించారు. అభయా ఎలా చనిపోయింది..? మహిళలు గత 15 ఏళ్లుగా హింసను ఎలా అనుభవించారు? కమ్దునీ, పార్క్ స్ట్రీట్‌లలో వందల మంది మా పార్టీ కార్యకర్తలను హత్య చేసి చెట్లకు వేలాడదీసింది చూడాలి. అభివృద్ధి లక్ష్యంతోనే కొత్త ప్రభుత్వం వచ్చింది. రాష్ట్ర ప్రగతి కోసం కలిసి జట్టులా పనిచేద్దాం" అని పేర్కొన్నారు

# గాజియాబాద్‌లో సంచలనం.. మిత్రుడిని హత్య చేసిన యువకుడి ఎన్‌కౌంటర్..!



గాజియాబాద్‌లో ఉద్రిక్తతలకు కారణమైన ఓ హత్య కేసులో నిందితుడు శనివారం అర్ధరాత్రి పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయాడు. కొన్నాళ్ల క్రితం సూర్యప్రతాప్ చౌహాన్ (17) అనే యువకుడిని అతడి మిత్రుడు అసద్ మరికొందరితో కలిసి కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ దాడి అనంతరం అతడు పరారయ్యాడు. దీంతో పోలీసులు అతడిపై రూ.50,000 రివార్డ్ ప్రకటించారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నిందితుడు అసద్ ఓ మిత్రుడి వద్ద డబ్బులు తీసుకోవడానికి ఖోడా అనే ప్రదేశానికి వస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. అతడు నగరం నుంచి పారిపోవాలని ప్లాన్ చేసినట్లు గుర్తించారు. నిందితుడి కోసం పోలీసులు ఇందిరాపురంలో వలపన్నారు. బైక్‌పై అసద్ రాగానే లొంగిపోవాలని పోలీసులు హెచ్చరించారు. అయినా.. అతడు లెక్కచేయకుండా పోలీసులపైకి కాల్పులు జరపడంతో.. వారు ఎదురు కాల్పులు మొదలుపెట్టారు. తూటా అసద్‌కు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనా స్థలం నుంచి ఓ నాటు తుపాకీ, బైక్ స్వాధీనం చేసుకొన్నారు. అసద్ మిత్రుడు అక్కడి నుంచి తప్పించుకోవడంతో అతడి కోసం గాలింపు చేపట్టారు.

సినిమా





## నేరుగా యూట్యూబ్‌లోకి రానున్న ఏక్ దిన్

[illegible]

## నెట్ ఫ్లిక్స్‌లో ప్రీతి అస్రానీ 29

[illegible]

## ఆ విషయంలో టాలీవుడ్ తర్వాతే ఎవరైనా

[illegible]






## హీరోయిన్‌గా రాను బొంబాయికి రాను డ్యాన్సర్



[illegible]

## సినీ పరిశ్రమలో ఏదీ శాశ్వతం కాదు

[illegible]



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.